RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశం

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 230 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి బుధవారం 19-8-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు,శ్రావణ మాసం, తిథి: సప్తమి రా॥8.27, స్వాతి ఉ॥9.10, వర్జ్యం మ॥ 3.12-4.55, దుర్ముహూర్తం ఉ॥ 11.40-12.31, శుభ సమయం ఉ॥ 10.30-12.00, రాహుకాలం మ॥ 12.00-1.30, సూర్యోదయం ఉ॥ 5.45, సూర్యాస్తమయం సా॥ 6.26 గం॥

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా వర్ల, దళవాయి రమాదేవి





**అమరావతి,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** ఏపీలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. ఎస్సీ, బీసీల నుంచి ఒక్కొక్కరికి అవకాశం కల్పించింది. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, తెదేపా అనంతపురం లోక్‌సభ నియోజకవర్గ అంగన్‌వాడీ సంఘం అధ్యక్షురాలు దళవాయి రమాదేవి పేర్లను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు సంబంధిత దస్త్రాన్ని గవర్నర్ ఆమోదం కోసం లోక్‌భవన్‌కు పంపినట్లు సమాచారం. ఈ మేరకు అసెంబ్లీలో కూడా సిఎం చంద్రబాబు ఎమ్మెల్సీల పేర్లను ప్రకటించారు.

# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు ఆమోదం

**-గ్రామీణ ప్రాంతాల్లో 34, పట్టణ ప్రాంతాల్లో 33.1 శాతం రిజర్వేషన్లు -మేయర్ల ఎన్నికలకు ప్రత్యక్ష పద్ధతిలో వెళ్లాలని నిర్ణయం**

**-ఆర్థిక సంఘం నిధులు నష్టపోకుండా సకాలంలో ఎన్నికల నిర్వహణ - దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై కేబినేట్‌లో చర్చ**

**అమరావతి,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లపై కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించింది. అలానే పట్టణ ప్రాంతాల్లో బీసీలకు 33.1 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల హామీ మేరకు బీసీలకు రిజర్వేషన్లను పెంచే అంశంపై ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు చేసిన నేపథ్యంలో కేబినెట్ నిర్ణయంకు ప్రాధాన్యత సంతరించుకుంది. స్థానిక సంస్థల ఎన్నికలను అక్టోబర్‌లోగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.16,500 కోట్ల నిధులు నష్టపోకుండా ఉండేందుకు ఎన్నికలను సకాలంలో నిర్వహించాల్సిన అవసరాన్ని కేబినెట్ పరిగణనలోకి తీసుకుంది. బిసిలకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, మేయర్ల ఎన్నికలకు ప్రత్యక్ష పద్ధతిలో వెళ్లాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విశాఖలో అక్షత్ గ్రీన్‌టెక్ సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంట్, డేటా సెంటర్ల



ప్రతిపాదనలకు ఆమోదం ఇచ్చింది. తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడలో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు 55కు పైగా అజెండా అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించి.. పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలు, మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికలు, పరిశ్రమలు, ఇంధనం, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, మౌలిక వసతులకు సంబంధించిన పలు అంశాలపై కేబినెట్ నిర్ణయాలు తీసుకుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్లు, చైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే డిప్యూటీ మేయర్లు, డిప్యూటీ చైర్మన్ల విషయంలో పాత విధానాన్ని కొనసాగిస్తూ.. ఒక్కరికి మాత్రమే పరిమితం చేయాలని నిర్ణయించింది. పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించి కూడా కేబినెట్ పలు కీలక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. కర్నూలులో అగస్త్య గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే 12 గిగావాట్ల సిలికాన్ ఇంగాట్, వేఫర్ ప్లాంట్ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. విశాఖపట్నంలో అక్షత్ గ్రీన్‌టెక్ ఆధ్వర్యంలో సోలార్ సెల్, మాడ్యూల్ ప్లాంట్, డేటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలి తీసుకున్న నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తిరుపతి, సూర్యలంక, కేశరపల్లి, కాకినాడ ప్రాంతాల్లో స్టార్ హోటళ్ల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇంధన రంగంలో హైబ్రిడ్, సోలార్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. అమరావతి రైల్వే లైన్ కోసం భూసేకరణ, ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించిన అంశంపైనా నిర్ణయం తీసుకుంది. హ్యామ్ మోడల్‌లో రూ.7,469.46 కోట్లతో రోడ్లు, పార్కుల అభివృద్ధి చేపట్టాలని నిర్ణయించింది. రాష్ట్రంలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాల విషయంలోనూ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ ప్రకటించేందుకు ఆమోదం తెలిపింది. బీసీ విద్యార్థుల మిగతా 2లో..



# ఓర్వకల్లు డ్రోన్ సిటీకి ప్రపంచవ్యాప్త గుర్తింపు

**-అన్నిరంగాల్లో పెరిగిన డ్రోన్ వినియోగం**

**-సీఎం చంద్రబాబు విజన్‌తో పారిశ్రామికవేత్తల రాక**

**-డ్రోన్ల ఎగుమతితో పెరగనున్న దేశ ఖ్యాతి**

**-డ్రోన్ కంపెనీల సిఇవోలతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు భేటీ**

**కర్నూలు,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** డ్రోన్ సిటీకి దేశంలోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రానుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుఅన్నారు. అన్ని రంగాల్లో ఇప్పుడు డ్రోన్‌ల వినియోగం పెరిగిందని పేర్కొన్నారు. కర్నూలు సమీపంలోని ఓర్వకల్లు మండలం పాలకొలను వద్ద ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీలో వివిధ డ్రోన్ సంస్థలకు చెందిన సీఈవోలతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో 6 లక్షల డ్రోన్‌ల అవసరం ఉండగా.. ప్రస్తుతం 40 వేల డ్రోన్లు మిగతా 2లో..

# వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి


**-సామాన్యుడిగా వచ్చి.. అసామాన్యుడిగా ఎదిగారు**

**-కార్యకర్తలకు బిజెపి అధ్యక్షుడు నబీన్ హితోక్తి**



**విశాఖపట్నం,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** కార్యకర్త నుంచి జాతీయ నాయకుడిగా ఎదిగిన భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పోరాటాల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని బీజేపీ శ్రేణులకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ స్పష్టం చేశారు. మంగళవారం విశాఖపట్నంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే బీజేపీ అతి పెద్ద పార్టీగా ఉందని అన్నారు. దేశాన్ని మరింత శక్తిమంతంగా చేయడానికి సంకల్పం తీసుకోవాలని ప్రతి కార్యకర్తకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశంలో మంచి పాలన అందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమికి మంచి విజయాన్ని అందించిన ప్రజలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. మిగతా 2లో..

## స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం



-బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం

-ఎన్నికల హామీ మాత్రమే కాదు.. తమ రాజకీయ సిద్దాంతం

-ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకొనే రోజు ఇది

-టిడిపి వచ్చిన తరవాతనే ఎందరో బిసి నేతలుగా ఎదిగారు

-అసెంబ్లీ చర్చలో సిఎం చంద్రబాబు నాయుడు

2లో

# మండలిలో రచ్చకే వచ్చారా?

**వైకాపా సభ్యుల తీరుపై మండిపడ్డ కేశవ్**



**అమరావతి,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** శాసన మండలిలో ప్రజా సమస్యలపై మాట్లాడకుండా, అల్లరి చేసి సభ నుంచి వెళ్లిపోవాలనేది వైకాపా సభ్యుల ఉద్దేశంగా కనిపిస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. మండలి సమావేశాల్లో రెండోరోజు కూడా డీఎస్సీ అంశంపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం నడిచింది. ఛైర్మన్ మోషేను రాజు అధ్యక్షతన కార్యకలాపాలు ప్రారంభం కాగానే... డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు జరిగాయని వైకాపా సభ్యులు వాయిదా తీర్మానం ఇచ్చారు. వాయిదా తీర్మానం తిరస్కరించిన మండలి ఛైర్మన్... ప్రశ్నోత్తరాలు ప్రారంభించారు. దీంతో వైకాపా సభ్యులు ఛైర్మన్ పోడియం చుట్టూ చేరి ఆందోళనకు దిగారు. ప్రశ్నోత్తరాల సమయంలోనే మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణకు ఛైర్మన్.. మాట్లాడే అవకాశమిచ్చారు. శాసనమండలిలో డీఎస్సీ గురించి చర్చ కోరుతుంటే ప్రభుత్వం ఎందుకు వెనుకంజ వేస్తుందని బొత్స ప్రశ్నించారు. వేరే ఫార్మాట్లో రావాలని బొత్సకు ఛైర్మన్ చెప్పినా పట్టించుకోలేదు. దీంతో వైకాపా సభ్యుల తీరుపై శాసనసభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛైర్మన్‌ను అగౌరవపరిచేలా ప్రతిపక్ష సభ్యులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఎలా నడపాలనేది ప్రజలు నిర్ణయించారని... ప్రజాతీర్పు ప్రకారమే సభను నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఎల్‌నినో సమస్య తీవ్రంగా ఉండి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కాబట్టి.. ఆ అంశంపై ముందు చర్చించి.. డీఎస్సీ గురించి తర్వాత మాట్లాడతామన్నారు. డీఎస్సీ చాలా ముఖ్యమైన మిగతా 2లో..

# రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు

**-కోనసీమ కొబ్బరి రైతులకు అండగా ప్రభుత్వం**

**- కాలువల్లో పూడికతీతతో ఉప్పునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం**

**- శాసనసభలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, ఆగస్ట్ 18 (ఆర్ఎన్ఏ):** కోనసీమలో కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కాకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు గిడ్డి సత్య నారాయణ, బండారు సత్యానందరావులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటించడంతో పాటు కాలువలు, డ్రెయిన్ల పూడికతీత ద్వారా సమస్య మూలాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతుండగా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే 0.36



లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగవుతోందని మంత్రి తెలిపారు. కోనసీమ జిల్లాలో సుమారు 10 వేల హెక్టార్లలో కొబ్బరి తోటలు కౌలు రైతుల ద్వారా సాగవుతున్నాయని వివరించారు. గత ఐదేళ్లుగా కాలువల్లో సక్రమంగా పూడికతీత చేపట్టకపోవడంతో సముద్రపు ఉప్పునీరు బ్యాక్ వాటర్ రూపంలో వెనక్కి వచ్చి నేలలో లవణీయత పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. దీని ప్రభావంతో పైకి ఆరోగ్యంగా కనిపించే మిగతా 2లో..

## 29న రైతు పంచాయితీకి సిద్ధం అవుతున్న పంజాబ్ రైతులు

**న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా పంజాబ్ రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా జగ్జీత్ దల్లేవాల్ నేతృత్వంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 29న దేశ రాజధానిలో 'రైతు పంచాయతీ' జరుగనున్నది. కాగా ఆదివారం ఢిల్లీ మార్చ్‌కు బయలుదేరిన వందలాది మంది రైతులను పంజాబ్ వైపున గల ఖానౌరీ సరిహద్ద వద్ద జింద్ పోలీసులు అడ్డుకున్నారు. బారికేడింగ్‌తో ఆ మార్గాన్ని సీల్ చేశారు. జగ్జీత్ దల్లేవాల్ హర్యానా- పంజాబ్ సరిహద్దులోని దాతాసింగ్ వాలా గ్రామం నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వరకు 'కిసాన్ బచావో పాదయాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇది ఆగస్టు 29న రాజధానిలో 'రైతు పంచాయతీ'తో ముగుస్తుందని తెలియజేశారు. క్రిసాన్ మోర్చా ప్రతినిధులకు హర్యానా అధికారులకు మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

# ఉరిశిక్షను రద్దు చేయండి


**-ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి**

**-సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత**



**న్యూఢిల్లీ,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు మిగతా 2లో..

## వైకాపా నేత జోగి రమేష్ ముందస్తు బెయిల్‌పై తీర్పు వాయిదా



**విజయవాడ, ఆగస్టు 18:** వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పు ఈనెల 21కి వాయిదా పడింది. కోడలు మేఘన ఫిర్యాదుతో జోగి రమేష్, ఆయన సోదరుడు రాము, సోదరి రమా సహా 11 మందిపై ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. మేఘన ఫిర్యాదుతో నిందితులపై పోలీసులు హత్యాయత్నం, అదనపు వరకట్న వేధింపులు, గృహహింస చట్టం, మోసం కింద కేసులు నమోదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ కోసం జోగి రమేష్ పిటిషన్ దాఖలు చేయగా కోర్టులో వాదనలు జరిగాయి. జోగి రమేష్‌పై ఇప్పటికే 60కి పైగా క్రిమినల్ కేసులున్నాయని, బాధితురాలిపై హత్యాయత్నం చేయడమే కాకుండా బలవంతంగా మత మార్పిడికి యత్నించారని కోర్టుకు పీపీ తెలిపారు. రాజకీయ కక్షతోనే అక్రమ కేసులు బనాయించారని, హత్యాయత్నం, వరకట్న వేధింపులకు ఎటువంటి ఆధారాలు లేవని జోగి రమేష్ తరపు న్యాయవాదులు వాదించారు.

# చరిత్రలో బీసీలు మరిచిపోలేని రోజు

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై హర్షం**

**గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం అమలు**

**అమరావతి, ఆగస్టు 18 (ఆర్ఎన్ఏ):** 'చరిత్రలో ఈరోజు బీసీలు మరిచిపోలేని రోజు... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది... గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం అమలు కాబోతున్నాయి...' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సంతోషం వ్యక్తంచేశారు. స్థానిక స్వపరిపాలనలో వెనుకబడిన వర్గాలకు సాధికారత కల్పించడంపై శాసనసభలో లఘు చర్చ జరిగింది. మంత్రి సవిత ఈ చర్చను ప్రారంభించారు. బీసీలకు అవకాశం ఇవ్వడం, ప్రాతినిధ్యం కల్పించడం రాజకీయ సాధికారిత కల్పించడం తమ విధి అని



చెప్పారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు ఈరోజు మంత్రి మండలిలో ఆమోదించామన్నారు. బీసీలకు ఎన్నికల ముందు ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం మిగతా 6లో..

అత్యున్నత సత్యాలు, అభ్యాస యోగ్యాలై ఆచరించే సమాజమే శ్రేష్ఠమైన సమాజం. పవిత్రంగా నిస్వార్థంగా ఉండడానికి సదా ప్రయత్నించు. మత సారమంతా ఇదే!.

## నేటి మనదేశమ్ సంపాదకీయం


# ముష్కరుల కదలికలపై కన్నేయాలి!

గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన వెనక అల్ఖైదా అనుబంధ సంస్థల ప్రమేయం ఉన్నట్లు అంతర్జాతీయ సంస్థలు గుర్తించాయి. ఐక్యరాజ్య సమితి కూడా దీనిని గుర్తించింది. భారత్లో దాడులకు అల్ఖైదా పథకాలు రచిస్తోందని, అనుబంధ సంస్థలను ప్రోత్సాహిస్తోందని అంటున్నారు. ఢిల్లీ ఎర్రకోట ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. ఎన్ఎస్జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయాలని చూడటం లేదో... ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటికిమొన్న పహల్గామ్లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. తరవాత ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామిక్ టెర్రరిస్టులు లక్ష్యం భారత్ దాడులకు జరిగిన ప్రతిసారీ రుజువు అవుతూనే ఉంది. ఈ విషయంలో వారికి గట్టి బుద్ధి చెప్పకపోతే దేశం మరిన్ని దాడులకు గురికాక తప్పదు. ఇదిలావుంటే పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ హిందువులపై అక్కసు వెళ్లగక్కారు. దేశ విభజన సమయంలో దాదాపు 30 శాతంగా ఉన్న హిందువులు ఇప్పుడు 3 శాతానికి పడిపోయారు. బెదిరింపులు, ఒత్తిళ్లతో మతమార్పిళ్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. పాక్లో ఇప్పుడున్న 3శాతం మంది హిందువులను పాక్ ముస్లింలు భరించే స్థితిలో లేరని జర్దారీ చేసిన వ్యాఖ్యలు మనకు ఓ హెచ్చరిక లాంటివి. ఈ క్రమంలో ప్రతి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉండడంతో పాటు, నిరంతరం అది ఉగ్రవాదులను ప్రోత్సహిస్తూనే ఉంది. ఇటీవల పాక్కు చెందిన మాజీమంత్రి ఒకరు లష్కరే తోయిబా చీఫ్ హఫీజ్కు శిష్యుడినని ప్రకటించుకున్నారు. ఇవన్నీ కూడా తేలికగా తీసుకోరాదు. కేవలం ఆపరేషన్ సిందూర్తో ఇది సమిసిపోలేదని గుర్తించాలి. ఎప్పటికప్పుడు దాడుల ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు భారత్కు సవాల్ విసురుతూనే ఉన్నారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి కదలికలను ప్రజలు కూడా గుర్తించాలి. మన పక్కన ఎవరు ఏం చేస్తున్నారో కన్నేసి ఉంచాలి. ఎందుకంటే మత మార్పిళ్లు, దాడులు ఆయుధంగా ఇస్లామిక్ ఉగ్రవాదులు నిరంతరం పంజా విసురుతూనే ఉన్నారు. పుణెలో టీసీఎస్ కంపెనీలో మతమార్పిడికి ఎలాంటి కుట్రలు చేశారు చూశాం. ఇవన్నీ ఓ పద్ధతి ప్రకారం జరుగుతున్నాయి. ఇలాంటి ముష్కరులకు మనదేశంలో ఉండే స్థానం లేకుండా చేయాలి. పుల్వామా దాడి తరవాత పాక్పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఏదో రకంగా ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదులతో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు. ఇకపోతే గతంలో ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండడం మంచిది. ఎవరు ఎలా ఉంటున్నారో గుర్తించాలి. వారి నయవంచక మాటలకు నమ్మి మోసపోవద్దు. ముఖ్యంగా ఎక్కడెక్కడ ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా వస్తూ పోతున్న వారి కదలికలను గుర్తించాలి. ఎవరు ఎక్కడికి వెళుతున్నారు.. ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా అధికారుల బాధ్యతలను భుజాన వేసుకోవాలి. దుర్ఘటనలు జరిగిన తరవాత చింతించే బదులు అనుమానంతో మన పనులు మొదలు పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకోకుండా మనమంతా నిత్య జాగరూకతతో ఉండడం అలవర్చుకోవాలి. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో.. ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తిలో ఉన్నవారు కూడా మత ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్య వృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణాలు తీయడం ఓ లెక్క కాదని గతంలో రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థలు వేటాడుతూనే ఉన్నాయి. పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం వివిధ రూపాల్లో మనపై నిరంతరం దాడులకు పురమాయిస్తోంది. ఈ దేశంపై మారణ హోమం సృష్టిస్తున్న కొందరు మనదేశం ఏమయినా ఫర్వాలేదు.. తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమాలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా... ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్తో పాటు, మెట్రో స్టేషన్లలో ప్రజలే అనుమానంతో పరిశీలన చేయాలి. పోలీసులకు అనుమానంపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోగలం.

# స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతం

**-బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం -ఎన్నికల హామీ మాత్రమే కాదు.... తమ రాజకీయ సిద్ధాంతం -ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకొనే రోజు ఇది**

**-టిడిపి వచ్చిన తరవాతనే ఎందరో బిసి నేతలుగా ఎదిగారు -అసెంబ్లీ చర్చలో సిఎం చంద్రబాబు నాయుడు**



**అమరావతి,ఆగస్ట్18(ఆర్ఎన్ఎ):** బీసీలకు అండగా ఉంటామని తమ ప్రభుత్వం మరోసారి రుజువు చేసిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు అంశంపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం ఇది అని చెప్పారు. ఇది ఎన్నికల హామీ మాత్రమే కాదని.. తమ రాజకీయ సిద్ధాంతమన్నారు. హామీ ఇవ్వడమే కాకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయమని.. ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకొనే రోజు ఇది అని చెప్పారు. తెదేపా రాకముందు రాజకీయ అధికారం కొన్ని వర్గాలకే పరిమితమైంది. ఎన్టీఆర్ వచ్చాకే బీసీలకు ఆ అవకాశం దక్కింది. మా పార్టీలో ఎంతోమంది బీసీలు నేతలుగా ఎదిగారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, దేవేందర్గౌడ్ ఉన్నత స్థాయికి చేరుకున్నారు. 1995లో బీసీలకు ఉన్న 20 శాతం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచామన్నారు. తెదేపా పాలనలో బీసీల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. కులవృత్తులు, చేతివృత్తులకు అండగా నిలిచాం. బీసీలకు ఆదరణ కింద 341 పరికరాలను 90 శాతం రాయితీతో ఇచ్చాం. బీసీల కోసం రూ. 32 వేల కోట్లు ఖర్చు చేశాం. వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు ఇస్తున్నాం. నేతన్న సేవ కింద ప్రతి కుటుంబానికి రూ. 25 వేలు అందజేస్తున్నాం. మత్స్యకారులకు ప్రతి దశలోనూ అండగా ఉంటున్నాం. 217 జీవో రద్దు చేసి మత్స్యకారులను ఆదుకున్నాం. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణుల జీతాలను రూ. 25వేలకు పెంచాం. బీసీలు సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే రూ. 95వేల రాయితీ ఇస్తున్నాం. బీసీలకు విద్య, నైపుణ్యం, ఉపాధి, వ్యాపార, రాజకీయ ప్రాతినిధ్యం ఇస్తాం. మేం తెచ్చిన బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు. రాజ్యాంగ పరిమితులు పాటిస్తూనే సామాజిక న్యాయం చేస్తున్నాం. సమాజంలో ప్రతి వర్గానికీ అవకాశం కల్పించాలనేది మా లక్ష్యం' అని చంద్రబాబు అన్నారు. అందుకే బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు నాయుడు అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం కేవలం ఎన్నికల హామీ కాదని, అది తమ రాజకీయ సిద్ధాంతంలో భాగమని చంద్రబాబు స్పష్టం చేశారు. హామీలు ఇవ్వడంతోనే ఆగిపోకుండా వాటిని అమలు చేసి చూపిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం బిసిలకు రిజర్వేషన్ల విషయంలో చేసిన అన్యాయన్ని సరిచేయడానికి ప్రత్యేక క్యాబినెట్ పెట్టి నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చెప్పారు. 2024 ఎన్నికల్లో ఈ స్థాయి గెలుపుకు కారణం బిసిల వల్లేనని చెప్పుకొచ్చారు. 94శాతం స్ట్రయిక్ రేట్ 57శాతం ఓట్లు వచ్చాయంటే అది బిసిల వల్ల, నాయకత్వంపై ఉన్న నమ్మకం వల్ల మాత్రమేనని పేర్కొన్నారు. బిసిలకు న్యాయం చేయాలని తాను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలు ఎన్నికలకు ముందే నిర్ణయం తీసుకున్నామన్నారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పారు. ఈ రెండు అంశాలకు సంబంధించిన నిబంధనలు చట్టాల్లో ఉన్నాయని వివరించారు. అర్బన్ లోకల్ బాడీల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకునే విధానం ఉంటుందని చంద్రబాబు వెల్లడించారు. రాబోయే రోజుల్లో 28 జిల్లా పరిషత్లు ఏర్పడే అవకాశం ఉందన్నారు. బీసీ రిజర్వేషన్లను కాపాడటంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు అండగా ఉంటుందనే విషయాన్ని ఈ నిర్ణయం మరోసారి నిరూపించిందన్నారు. టీడీపీ ఆవిర్భావానికి ముందు రాజకీయాల్లో ఫ్యూడలిజం ఉండేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలనే ఆలోచనతో ముందుకెళ్లారని తెలిపారు. ఎర్రం నాయుడు, కేఈ కృష్ణమూర్తి, అయ్యన్నపాత్రుడు, యనమల రామకృష్ణుడు, తెలంగాణలో దేవేందర్ గౌడ్ వంటి నాయకులను రాజకీయంగా ముందుకు తీసుకురావడంలో ఎన్టీఆర్ కీలక పాత్ర పోషించారని చంద్రబాబు పేర్కొన్నారు. 1995లో తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చామని చంద్రబాబు గుర్తుచేశారు. అయితే 2019లో ప్రభుత్వం మారిన తర్వాత బీసీలకు అన్యాయం జరిగిందని అన్నారు. అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో ఎంఎస్ 176ను హైకోర్టులో సవాలు చేయగా.. న్యాయస్థానం దానిని కొట్టివేసిందని, అయితే ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించలేదని చంద్రబాబు విమర్శించారు. 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 24.5 శాతానికి తగ్గించారని వ్యాఖ్యానించారు. బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వడంలో టీడీపీకి ముందు, టీడీపీ తర్వాత అనే చర్చ జరగాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అన్నారు. బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చాక బీసీలకు అన్యాయం జరిగింది. రిజర్వేషన్ల పెంపుపై కొందరు హైకోర్టుకు వెళ్లారు. ఉన్నత న్యాయస్థానం ఆ జీవోను కొట్టేసినా గత ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లలేదు. బీసీలకు ద్రోహం చేయడంలో వైకాపా నాయకుడు జగన్ నంబర్ వన్. 34 శాతం ఉన్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించారు. దీంతో వైకాపా హయాంలో 16,800 మంది బీసీ నేతలు నష్టపోయారు. ఎంపీటీసీ నాగరాజును కర్నూలు ఎంపీగా చేసిన ఘనత ఎన్డీయేది. వడ్డెర మహిళ దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చాం అని అన్నారు. వైకాపా హయాంలో అనేక మంది బీసీ నేతలను వేధించారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడిని ఇబ్బంది పెట్టారు. తెదేపాకు మద్దతుగా ఉన్నారని అనేక మంది బీసీలను హత్య చేశారు. ఆయా వర్గాలపై కిరాతకంగా ప్రవర్తించారు. 56 బీసీ కార్పొరేషన్ల పేరిట నాటకాలు ఆడారు. డీఎస్సీపై 350 కేసులు వేసి ఇబ్బందులు పెట్టారు. ఉపాధ్యాయ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. బీసీ రిజర్వేషన్లపై కోర్టుకు వెళ్తే చరిత్రహీనులుగా మిగులుతారు.. జాగ్రత్త అని అన్నారు.

మొదటి పేజీ తరువాయి

## స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు ఆమోదం

కోసం జేఈఈ, నీట్ పరీక్షల శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఉన్నత విద్యా రంగానికి సంబంధించి ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ ఏర్పాటు చేసే బిల్లుకు కూడా ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రంలోని ఉన్నత విద్యా వ్యవస్థలో మరిన్ని మార్పులకు మార్గం సుగమం కానుంది. ఏపీఎస్బీసీఎల్కు రూ. 5 వేల కోట్ల వర్కింగ్ క్యాపిటల్ రుణం ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. అవయవ మార్పిడికి సంబంధించిన ట్రాన్స్ప్లాంటేషన్ బిల్లుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 నీటి ప్రాజెక్టులపైనా మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. ఇదిలావుంటే ద్రవ్యోల్బణం పెరుగుతున్నందున ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర మంత్రివర్గం అంజెడా అంశాలు ముగిశాక వివిధ పరిణామాలపై సీఎం చర్చించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని మంత్రులకు సూచించారు. అక్టోబర్లోగా స్థానిక ఎన్నికలు జరగకుంటే రూ.12150 కోట్లు అర్బన్ లోకల్ బాడీ నిధులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. న్యాయ పరిధిలో 23 మున్సిపాలిటీల విలీన పక్రియను తర్వాత చూసుకుందామని.. ముందైతే అన్నింటిలోనూ ఎన్నికలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. మద్యం బ్రాండ్లు పిచ్చి పిచ్చి పేర్లతో రాకుండా కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అక్రమార్కులు కంటైనర్లలో ఇసుక తరలింపునకు యత్నిస్తుంటే కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు

కొబ్బరి చెట్లు కూడా అకస్మాత్తుగా కుంగిపోయి చనిపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యను తాను స్వయంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించానని, ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ కూడా ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దెబ్బతిన్న ప్రతి కొబ్బరి మొక్క స్థానంలో కొత్త మొక్క నాటేందుకు ఒక్కో మొక్కకు రూ. 1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. కొత్త మొక్కలు నాటడంతోనే సమస్య పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. కాలువలు, డ్రెయిన్లలో పూడిక తొలగించకుండా ఎన్ని మొక్కలు నాటినా, ఎంత పెట్టుబడి పెట్టినా ఆశించిన ఫలితం ఉండదన్నారు. అందుకే సమస్యకు మూలమైన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మొదటి విడతలో శంకరగుప్తం కాలువ పనులకు నిధులు కేటాయించామని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటికే శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ పనులు పూర్తయితే రెండు, మూడు నియోజకవర్గాల్లో ఉప్పునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మిగిలిన కాలువలను కూడా ఒక సమగ్ర ప్రాజెక్టుగా చేపట్టి శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.కొబ్బరి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కొబ్బరి అభివృద్ధి మండలి సహకారంతో 2017-18 నుంచి 2024-25 వరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 5,250 హెక్టార్లను పథకం పరిధిలోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కొత్త కొబ్బరి తోటల విస్తరణకు హెక్టారుకు రూ. 56 వేల సబ్సిడీని రెండేళ్లలో రూ. 28 వేల చొప్పున రెండు సమాన వాయిదాల్లో అందిస్తున్నామన్నారు. ఉద్యానవన తోటల విస్తరణకు సంబంధించిన కార్యక్రమం కింద గుంటలు తవ్వడం, మొక్కలు నాటడం, సాగు పరికరాలు తదితరాలకు మూడు సంవత్సరాల పాటు హెక్టారుకు రూ. 2,47,950 వరకు ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందన్నారు. కోనసీమలో కొబ్బరి రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక ప్రాంతీయ కొబ్బరి బోర్డు కార్యాలయం ఏర్పాటు చేయాలని 2024లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేంద్ర మంత్రికి లేఖ రాశారని మంత్రి గుర్తుచేశారు. కేంద్రంలోని కొబ్బరి బోర్డు సహకారంతో కొత్త ప్లాంటేషన్లను ప్రోత్సహించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## వెంకయ్యనాయుడిని ఆదర్శంగా తీసుకోండి

సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి ఫలాలను అందించడానికి కూటమి ఏర్పాటైందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్పై ప్రధాన మోదీ ప్రత్యేక దృష్టి పెట్టారని గుర్తు చేశారు. తమ కలలను సాకారం చేసే పార్టీని ప్రజలు గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. అనేక ప్రాజెక్టులు ద్వారా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి డబల్ ఇంజిన్ సర్కార్ పని చేస్తుందని అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. విపక్షం కాంగ్రెస్ పార్టీ అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తుందని మండిపడ్డారు. దీనిని తిప్పి కొట్టాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బాధ్యతారహిత్యంగా ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేస్తున్నారని గుర్తు చేశారు. వాటిని ఖండించాలని పార్టీ శ్రేణులకు బీజేపీ చీఫ్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యల్లో నిరాశ కనపడుతోందని వ్యాఖ్యానించారు. విపక్షం వాడే భాష.. దేశాన్ని అస్థిర పరిచేలా ఉందన్నారు. దేశం ముందుకెళ్తుంటే సహించలేక పోతున్నారని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల వైఖరిని ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. ప్రస్తుత రాజకీయాల్లో విపక్షాలు, పార్ట్ టైం నాయకుల్లా తయారయ్యారని వ్యంగ్యంగా అన్నారు. యువతను ప్రభుత్వం మీద రాళ్లు విసిరేందుకు వాడితే.. మనం దేశ నిర్మాణానికి వాడుతున్నామని చెప్పారు. దేశంలోని యువతతో మమైకం కావాలని ఈ సందర్భంగా పార్టీ కేడర్కు సూచించారు. బీజేపీ జాతీయ వాదంతో ముందుకెళ్లాల్సి ఉందన్నారు. అన్ని వర్గాల వద్దకు వెళ్లి పార్టీని ముందుకు తీసుకెళ్లి.. బలోపేతం చెయ్యాలని పార్టీ శ్రేణులను ఆయన దిశానిర్దేశర చేశారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రాప్రదేశ్ దిశగా పనిచేయాలని శ్రేణులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీలో ఈ ఏడాదిలో జరిగిన అభివృద్ధిపై పుస్తకాన్ని జాతీయ బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ ఆవిష్కరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ నుంచి బీజేపీ జాతీయ కమిటీలో పదవులు పొందిన దగ్గుబాటి పురందేశ్వరి, విష్ణువర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా నితిన్ నబిన్ సన్మానించారు.

## మండలిలో రచ్చకే వచ్చారా?

విషయమని బొత్స వాదనకు దిగేందుకు ప్రయత్నించగా... పయ్యావుల తీవ్ర ఆగ్రహం వెలిబుచ్చారు. డీఎస్సీ అంటేనే తెలుగుదేశమని... 14 సార్లు డీఎస్సీ ఇచ్చామని తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా పని చేసి ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని బొత్స... ఇప్పుడు డీఎస్సీపై, నిరుద్యోగులపై ప్రేమ ఉన్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... డీఎస్సీపై శాసనసభలో మాట్లాడి, మండలిలో చర్చించేందుకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. వాస్తవ విషయాలు శాసనసభ మాదిరిగానే మండలిలోనూ చర్చించాలన్నారు. మెగా డీఎస్సీపై చర్చకు సమయం కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీఏసీలో చర్చించి ఏయే అంశాలు చర్చకు పెట్టాలో నిర్ణయించాలని ఛైర్మన్ మోషేన్‌రాజు సూచించారు. వైకాపా సభ్యుల నినాదాల మధ్య సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.

## ఉరిశిక్షను రద్దు చేయండి

చేయవచ్చని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో రాజ్యాంగం ధర్మాసనం ఈ విధానంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారా మరణశిక్షను అమలు చేసే వారు. అయితే ఆ సెక్షన్ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు. మరణశిక్ష అమలులో భాగంగా ఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వాలని పిటీషనర్ అభిప్రాయపడ్డారు. అనేక దేశాలు ఉరి తీయడానికి బదులుగా ప్రత్యామ్నాయ రీతిలో మరణశిక్షలను అమలు చేస్తున్నాయన్నారు. మరణశిక్ష అమలు రీతిలపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తెలిపారు. విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం విజయవంతంగా జరగడంలేదని సీనియర్ న్యాయవాది మీనాక్షి ఆరోరా వాదించారు. ఈ అంశంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆ న్యాయవాది కోరారు.

## ఓర్వకల్లు డ్రోన్ సిటీకి ప్రపంచవ్యాప్త గుర్తింపు

మాత్రమే ఉన్నాయని వివరించారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ చూసి.. డ్రోన్ కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. ఓర్వకల్లులో 600 ఎకరాల్లో డ్రోన్ సిటీ ఏర్పాటు అవుతుందని తెలిపారు. ఈ సిటీలో డ్రోన్ల తయారీ, ప్రొడక్షన్, శిక్షణ అన్ని ఉంటాయని వివరించారు. ఇక్కడ ఏర్పాటు చేసే సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాయితీలు, ప్రోత్సాహకాలు ఉంటాయని అన్నారు. డ్రోన్ శక్తిని వాటి పనితీరును ప్రధాని మోదీ గుర్తించారని చెప్పారు. మన టెక్నాలజీని ఉపయోగించి మనమే డ్రోన్ తయారు చేసి.. విదేశాలకు ఎగుమతి చేయాలని ప్రధాని మోదీ సంకల్పించారని గుర్తు చేశారు. విదేశాల నుంచి డ్రోన్ల దిగుమతిని కేంద్రం నిషేధించిందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భారతదేశంలోనే తొలి అతిపెద్ద డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వివిధ డ్రోన్ కంపెనీలతో సమీక్ష నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటామని తెలిపారు. 150 కంపెనీలకు చెందిన డ్రోన్ సంస్థల ప్రతినిధులతో ఈ కార్యక్రమం నిర్వహిచడం పట్ల కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే అసెంబ్లీలో డీఎస్సీ-2025పై చర్చకు రావాలని మంత్రి నారా లోకేశ్ ఆహ్వానిస్తే.. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ తప్పించుకుని తిరుగుతున్నారని రామ్మోహన నాయుడు ఎద్దేవా చేశారు. మంత్రి లోకేశ్ సవాల్ స్వీకరించి.. అసెంబ్లీలో చర్చకు రావాలని వైఎస్ జగన్కు ఆయన స్పష్టం చేశారు. ఓర్వకల్లులో కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు మాట్లాడుతూ.. మెగా డీఎస్సీపై అసెంబ్లీలో చర్చకు లోకేశ్ సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అసెంబ్లీకి వస్తే తన కుట్ర బయట పడుతోందనే భయంతో వైఎస్ జగన్.. చర్చకు రావడం లేదన్నారు. కూటమిపై దుష్ప్రచారం చేసి.. తన ఉనికిని కాపాడుకోవాలని వైఎస్ జగన్ చూస్తున్నారని విమర్శించారు. టీచర్లను లిక్కర్ షాపుల వద్ద నిలబెట్టిన వ్యక్తి వైఎస్ జగన్ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. టీచర్లను చూస్తే వైఎస్ జగన్కి కోపం, కక్ష అని చెప్పారు. మెగా డీఎస్సీలో ఎలాంటి అక్రమాలు లేకుండా.. పూర్తి పారదర్శకంగా వేలాది టీచర్ల పోస్టులు భర్తీ చేశామని కేంద్ర మంత్రి వివరించారు. ఏ ప్రభుత్వం చేయని టీచర్ ఉద్యోగాలు.. తాము భర్తీ చేశామని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు తీసుకురావడానికి మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రెండేళ్లలోనే ఏపీలో ఊహించని అభివృద్ధి జరిగిందని రామ్మోహన నాయుడు తెలిపారు.


**వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్**

VASTU HOUSING FINANCE

యూనిట్ నెం. 203 & 304, 2వ అంతస్తు, "A" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సెవ్రి (వెస్ట్), ముంబయి - 400015,మహారాష్ట్ర.

సీఐఎన్ నెం.: U65922MH2005PLC272501

**ఆస్తి స్వాధీన నోటీసు**

ఈ క్రింద సంతకం చేసిన వారు వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి గా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 ప్రకారం, అలాగే సెక్షన్ 13(12) తో పాటు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3 క్రింద ... 60 రోజులలోపు ... 13(4) మరియు ... రూల్ 8 ప్రకారం ... [illegible]

| క్రమ సంఖ్య | రుణగ్రహీత పేరు, సహ రుణగ్రహీత పేరు రుణ ఖాతా సంఖ్య | డిమాండ్ నోటీసు తేదీ & మొత్తం | ఆస్తి వివరణ | స్వాధీనం తీసుకున్న తేదీ మరియు విధానము |
|---|---|---|---|---|
| 1 | పాలపర్తి సునీత (రుణగ్రహీత), శ్రీ/శ్రీమతి. పాలపర్తి విజయ (సహ రుణగ్రహీత) MLP000000276046 | 16-మార్చి-26 14-మార్చి-26 నాటికి రూ.844146 | బాపట్ల రేర్ డిస్ట్రిక్ట్, చీరాల ఎస్.ఆర్, బాపట్ల జిల్లా వేటపాలెం మండలం, పాండిల్లపల్లి శివారు, కొత్తరెడ్డిపాలెం గ్రామ పంచాయతీ, పాండిల్లపల్లి గ్రామం ఎల్.పి.నెం.1050, ఎస్.నెం.36-3, అసెస్మెంట్ నెం.255, డోర్ నెం.2-55 వద్ద ఉన్న స్థిరాస్తిలో భాగమైన 320.44 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆర్.సి.సి. భవనం, మరియు ఈ సరిహద్దుల లోపల 320.44 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఇంటి స్థలం, అందులో 300 చదరపు గజాల విస్తీర్ణం గల... అన్ని ఫిట్టింగ్లు, ఫిక్చర్లతో సహా, అందులోని అన్ని సుఖభోగపు హక్కులతో కూడిన RCC భవనం. సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: ఉత్తరం - పంచాయతీ బజార్ 56 అడుగులు, దక్షిణం - వైలా పిచ్చయ్య ఆస్తి 56 అడుగులు, తూర్పు - వైలా బాబీలు ఆస్తి 51.6 అడుగులు, పశ్చిమం - పంచాయతీ బజార్ 51.6 అడుగులు. | సాంకేతిక స్వాధీనం తీసుకున్నారు తేది: 14-08-2026 |
| 2 | చొప్పర విజయమ్మ (రుణగ్రహీత), శ్రీ/శ్రీమతి. చొప్పర బాలకృష్ణయ్య (సహ రుణగ్రహీత) LP0000000100722 | 16-మే-26 12-మే-26 నాటికి రూ.1068611 | హరిజనవాడ ప్రాంతం, సర్వే నెం. 104, బ్లాక్ నెం. 2, బుచ్చిరెడ్డిపాలెం ఉప-జిల్లా, దగదర్తి మండలం, నెల్లూరు రిజి జిల్లా, ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా, నెల్లూరు రిజి జిల్లా, బుచ్చిరెడ్డిపాలెం ఉప-జిల్లా, సర్వే నెం. 104, పెదపుత్తేడు గ్రామ పంచాయతీ ఏరియా, పెదపుత్తేడు గ్రామం, సర్వే నెం. 104, బ్లాక్ నెం. 2, హరిజనవాడ ఏరియా, అసెస్మెంట్ నెం. 212 దియునామాల్ ఉన్న స్థిరాస్తికి సంబంధించిన సర్వస్వం, ఈ క్రింది సరిహద్దుల లోపల ఉన్న 11 అంకణములు లేదా 88 చదరపు గజాలు లేదా 73.59 చదరపు మీటర్ల స్థలం మరియు దానిలో నిర్మించబడిన 450 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న గ్రౌండ్ ఫ్లోర్ ఆర్.సి.సి. ఫ్లాట్ ఇల్లు మరియు 90 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న మొదటి అంతస్తు ఎ.సి.సి. ఇల్లు, దానిలోని అన్ని ఈజ్మెంట్ హక్కులతో సహా, దానిలోని అన్ని ఫిక్చర్లు మరియు ఫిట్టింగులతో పాటు, దానిలోని అన్ని ఈజ్మెంట్ హక్కులతో సహా. ఆంధ్రప్రదేశ్-524137 సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: ఉత్తరం - చొప్పర కోటయ్య ఇల్లు, దక్షిణ రోడ్డు, తూర్పు - చొప్పర వెంకటరామణయ్య ఇల్లు, పడమర - శ్రీ ఖింపూడి వెంకట రమణయ్య స్థలం. | సాంకేతిక స్వాధీనం తీసుకున్నారు తేది: 13-08-2026 |

తేది : 19.08.2026
స్థలం : ఆంధ్రప్రదేశ్

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

## హైకోర్టు బార్‌లోకి పనబాక భూలక్ష్మి



**నాయుడుపేట,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న టీడీపీ సీనియర్ నాయకురాలు పనబాక భూలక్ష్మి మరో ఘనతను సాధించారు. ప్రజా జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూనే న్యాయ విద్యను పూర్తి చేసి, తాజాగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ఎన్రోల్మెంట్ చేయిం చుకున్నారు. విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ ట్రస్ట్ బోర్డు సభ్యురాలిగా, టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, చంద్రగిరి నియోజకవర్గ అబ్జర్వర్‌గా, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ మహిళా అధ్యక్షురాలిగా పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న పనబాక భూలక్ష్మి.. తన రాజకీయ, సామాజిక సేవలతో పాటు న్యాయ విద్యపై కూడా దృష్టి సారించారు. ఈ క్రమంలో ఎల్.ఎల్.బి విద్యను విజయవంతంగా పూర్తి చేసి.. మంగళవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా అధికారికంగా ఎన్రోల్మెంట్ చేయించుకున్నారు. దీంతో ప్రజా సేవలో మరో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. ప్రజల సమస్యలను దగ్గరగా తెలుసుకున్న నాయకురాలిగా.. ఇప్పుడు న్యాయవాదిగా కూడా ప్రజలకు అండగా నిలిచే అవకాశం ఆమెకు లభించింది. న్యాయ విద్యను పూర్తి చేసి న్యాయ రంగంలోకి అడుగుపెట్టడం పట్ల టీడీపీ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ప్రజా సేవతో పాటు న్యాయపరమైన సేవలను కూడా కొనసాగిస్తూ మరింతమందికి అండగా నిలవాలని పలువురు ఆకాంక్షించారు. ఎల్.ఎల్.బి నుంచి హైకోర్టు ఎన్రోల్మెంట్ వరకు.. ప్రజా సేవకు న్యాయ సేవ తోడైంది.

## టిడిపితోనే బిసిలకు భరోసా!

### -రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు

**శ్రీకాళహస్తి, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తరతరాలుగా అణచివేతకు గురైన బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా స్థాపించిన తెలుగుదేశం పార్టీ తోనే భరోసా అని తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు కొనియాడారు. ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జయరాంరావు వీధిలోని ప్రజలను కలిసి, ఎన్డీయే ప్రభుత్వం యొక్క రెండేళ్ళ పాలనలో అందించిన సంక్షేమ మరియు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. బీసీలకు రాజకీయ, ఆర్థిక సాధికారతే లక్ష్యంగా స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అని హర్షం వ్యక్తం చేశారు. గత వైసిపి పాలనాకాలంలో జగన్ రెడ్డి యొక్క అగ్రవర్ణ పక్షపాత ధోరణి కారణంగా బిసి వర్గాలకు స్థానిక సంస్థలలో ఉన్న రిజర్వేషన్లను పది శాతం తగ్గించి, సుమారు 16,000 పైచిలుకు పదవులను బిసిలకు దూరం చేసిన ద్రోహ సంఘటనను బిసి వర్గాలు మరచిపోరని గుర్తు చేశారు. బిసి బిడ్డలకు న్యాయంగా అందవలసిన విద్య, ఉద్యోగ అవకాశాలను దూరం చేసిన బిసి ద్రోహి జగన్ రెడ్డి అని,బిసి వర్గాలకు అండగా నిలిచి, వారి జీవితాలకు భరోసా ఇస్తున్న ఏకైక రాజకీయ పార్టీ తెలుగుదేశం పార్టీ మాత్రమే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్,శ్రీకాళహస్తి పట్టణ సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ డి.వి.నారాయణ,నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్,బిసి విభాగం తిరుపతి పార్లమెంటు నాయకులు శంకరయ్య,గంగనపల్లి రమేష్, సులేమాన్,జమీర్ పాల్గొన్నారు.

## కదం తొక్కిన జర్నలిస్టు సంఘం నాయకులు



**సత్యవేడు, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడులో స్టార్ నైన్ రిపోర్టర్, బిజెపి నాయకుడు శ్రీకాంత్‌పై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును రద్దు చేయాలని పలువురు జర్నలిస్టు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సత్యవేడు నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సత్యవేడులో జర్నలిస్టు సంఘం నాయకులు కదం తొక్కి నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మహాత్మా గాంధీ స్మారక స్థూపం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీగా బయలుదేరి పోలీస్ స్టేషన్ చేరుకుని ఎస్ఐ సాయినాథ్ చౌదరికి వినతి అందించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని రెవెన్యూ డిటి వెంకటేశ్వర్లుకు దీనిపై వినతి పత్రంను సమర్పించారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ సంఘం నాయకులు పలువురు మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు కోసం పరితపించే పత్రికా విలేకరులపై ఎలాంటి విచారణ లేకుండా ఏకపక్షంగా కేసులు నమోదు చేయడం సరి కాదన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ మునిశేఖర్ తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి చేసిన తప్పుడు ఆరోపణలను ఆధారంగా తీసుకుని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదులో ఫిర్యాదు అంశాలే గాక వాస్తవ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్యవేడు, వరదయ్యపాలెం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రామచంద్రయ్య, సామర్ల హరి, ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, డీవీఎంసీ మెంబర్ గుత్తి త్యాగరాజు, విలేకరులు సలీం భాష, విజయ్ రెడ్డి, శ్రీనివాసులు, కుమార్, రాహుల్, నాగార్జున, శరవణ, రాజ, సోము రెడ్డి, ఖాదర్ భాష, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజాసేవతోనే ప్రజా ప్రతినిధులకు గుర్తింపు

### - మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ప్రతిమ



**సత్యవేడు, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నిరంతరం ప్రజాసేవతోనే ప్రజా ప్రతినిధులకు ప్రజాక్షేత్రంలో గుర్తింపు ఉంటుందని ఎంపీపీ ప్రతిమ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ అధ్యక్షతన ఎంపీడీవో వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ప్రతిమ మాట్లాడుతూ.. తమ పాలకవర్గం ఈ ఐదేళ్ల పదవి కాలంలో మండల అభివృద్ధి కోసం కృషి చేసామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు,తాగునీటి వసతి వంటి మౌలిక వసతుల కోసం మండల పరిషత్ నిధులను వెచ్చించామన్నారు. ముఖ్యంగా మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తుతున్న సమస్యలను పరిష్కరించడానికి తొలి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. తదనగుణంగా అధికారులు కూడా సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపడం పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో త్రివిక్రమరావు, ఆర్డబ్ల్యూఎస్ డిఈ శైలజ, ఆర్టీసీ డిఎం వెంకటరమణ, పిఆర్ ఏఈ ఇబ్రహీం ఖాన్, ఉపాధి ఏపీవో విజయభాస్కర్, వెలుగు ఇంచార్జ్ ఏపీఎం శివకుమార్, పలువురు ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం గంటల తరబడి నిరీక్షణ



**నాగలాపురం,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాగలాపురం ఈస్ట్ హ్యాబిటేషన్‌లో తాగునీటి కోసం ప్రజలు గంటల తరబడి బిందెలతో వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. గత నెల రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం మహిళలు, చిన్నారులు బిందెలతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదని వారు వాపోతున్నారు. తాగునీటి కోసం ఇంతలా వేచి ఉండాల్సి వస్తుందా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈస్ట్ హ్యాబిటేషన్‌లో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## క్రిటికల్ కేర్‌లో ఉన్న రోగుల నిర్వహణలో హిమోడైనమిక్ మానిటరింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత

### - స్విమ్స్- మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో హీమోడైనమిక్ మానిటరింగ్ వర్క్ షాప్



**తిరుపతి సిటీ, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్విమ్స్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో హీమోడైనమిక్ పర్యవేక్షణ, ముఖ్య అంశాలపై వర్క్ షాపు మంగళవారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డాక్టర్.ఆర్.వి.కుమార్, మెడిసిన్ విభాగాధిపతి మరియు సీనియర్ గ్రేడ్ ప్రొఫెసర్ డాక్టర్.అల్లాడి మోహన్, క్రిటికల్ కేర్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్. నటేష్, స్విమ్స్ మెడిసిన్ ప్రొఫెసర్ మరియు ఇండియన్ సొసైటీ క్రిటికల్ కేర్ మెడిసిన్ చైర్ పర్సన్ డాక్టర్.హరికృష్ణ, ఇండియన్ సొసైటీ క్రిటికల్ కేర్ మెడిసిన్ సెక్రటరీలు డాక్టర్ రానా ప్రతాప్, డాక్టర్.మదన్ మోహన్ రెడ్డిలు సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా॥ ఆర్.వి. కుమార్ మాట్లాడుతూ తీవ్రమైన అనారోగ్యంతో ఉన్న రోగుల చికిత్సలో హీమోడైనమిక్ మానిటరింగ్ ఎంతో కీలకమన్నారు. రోగి గుండె పనితీరు, రక్తప్రసరణ స్థితి తదితర అంశాలను సమగ్రంగా అంచనా వేసి, తగిన సమయంలో సరైన చికిత్స అందించేందుకు ఆధునిక హీమోడైనమిక్ మానిటరింగ్ పద్ధతులు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు. వైద్య విద్యార్థులు, పీజీ వైద్యులు, వైద్య నిపుణులు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.స్విమ్స్ మెడిసిన్ విభాగాధిపతి మరియు సీనియర్ గ్రేడ్ డా॥ అల్లాడి మోహన్ మాట్లాడుతూ రోగి యొక్క హీమోడైనమిక్ స్థితిని కేవలం సాధారణ వైటల్ పారామీటర్ల ఆధారంగా కాకుండా, అందుబాటులో ఉన్న ఆధునిక క్లినికల్ మరియు మానిటరింగ్ పద్ధతుల ద్వారా సమగ్రంగా అంచనా వేయాల్సిన అవసరం ఉందని వివరించారు. సరైన హీమోడైనమిక్ అంచనా ద్వారా రోగికి అవసరమైన చికిత్సను మరింత ఖచ్చితంగా నిర్ణయించవచ్చని తెలిపారు. ముఖ్యంగా క్రిటికల్ కేర్ లో తక్షణ నిర్ణయాలు తీసుకోవడంలో ఈ నైపుణ్యం వైద్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. వర్క్ షాపులో డాక్టర్.భార్గవ్, డాక్టర్.చంద్రశేఖర్, డాక్టర్.సురేఖ, డాక్టర్ శర్వాణి, డాక్టర్ .బాబు, డాక్టర్ . శ్రీకాంత్, డాక్టర్.మనోజ్, డాక్టర్. దీప్తి, మెడిసిన్ వైద్యులు, పీజీ విద్యార్థులు, యం.బి.బి.ఎస్ వైద్య విద్యార్థినులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యలపై రిలే నిరాహార దీక్ష చేపట్టిన ఆదినారాయణ స్వామి


**ములకలచెరువు, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రైతులు ప్రజలకు సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని మండలం లోని వేపూరు కోట వద్ద గల అవదూత ఆదినారాయణ స్వామి ఆశ్రమం వద్ద ఆశ్రమం పీఠాధిపతి ఆదినారాయణ స్వామి మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆదినారాయణ స్వామి మాట్లాడుతూ భూమి హక్కుదారుల నుండి కబ్జాదారులు అధికారుల అండతో భూములను కబ్జా చేస్తూ హక్కుదారులను ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. ఈ విషయాలపై అనేకసార్లు అధికారులు దృష్టి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. భూ కబ్జాదారుల నుండి భూ హక్కుదారులకు భూమి హక్కును కల్పించే వరకు ఈ దీక్షను చేపడతానని ఆయన తెలిపారు. భూ సమస్యలపై రిలే నిరాహార దీక్ష చేపడుతున్న ఆదినారాయణ స్వామికి మద్దతుగా మండలం భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి అంజనప్ప నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకుడు అంజినప్ప మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక భూ సమస్యలు ఉన్నాయని ప్రభుత్వం వీటిని పరిష్కరిస్తామని చెబుతూనే హక్కుదారులకు హక్కులు కల్పించకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. ప్రతిరోజు రెవెన్యూ కార్యాలయం చుట్టూ అధికారులు చుట్టూ సన్నకారు రైతులు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూమి హక్కుదారులకు భూ హక్కును కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. భూ సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఈ రిలే నిరాహార దీక్షలో పాల్గొని భూమి హక్కును కాపాడుకునే విధంగా ముందుకు రావాలన్నారు.

## డెంగ్యూ వ్యాధిపై అవగాహన



**పలమనేరు,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డెంగ్యూ వ్యాధి మాసోత్సవంలో భాగంగా, ఫ్రైడే డ్రై డే కార్యక్రమం పలమనేరు సబ్ యూనిట్ ఆఫీసర్ కే.సి జయశంకర్ ఆధ్వర్యంలో గాంధీనగర్ నందు లార్వాల్ సర్వేను సందర్శించారు. డెంగ్యూ వ్యాధి లక్షణాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ వ్యాధి రాకుండా ఉండాలంటే ఇంటి లోపల, ఇంటి బయట వారంపైన నీటి నిల్వలను తొల గించి ఆరబెట్టి నీరు పట్టుకోవడం వలన లార్వాల్ నశించి దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయని అవగాహన కల్పించారు. అంతేకాకుండా దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి. దుస్తులను పూర్తిగా కప్పి ఉంచవలసినదిగా వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అనిలా, ఎరపరెడ్డి, ఆశ జయంతి పాల్గొన్నారు.

## సహజ వనరులను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించాలి



**రామచంద్రాపురం,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మన పరిసరాలలో ఉన్న సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ కాపాడి భవిష్యత్తు తరాలకు అందించాలని ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ విశ్వవిద్యాలయం జియాలజీ విభాగాధిపతి డాక్టర్ సిద్ధిరాజు అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామాపురంలో ఉన్న సెవెన్ హిల్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ నందు "స్థానిక జలభద్రత సహజ వనరుల సుస్థిర నిర్వహణ, ఎదురవుతున్న సవాళ్లు వినూత్న పరిష్కారాలు, భవిష్యత్తు వ్యూహాలు" అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ శిక్షణ కార్యక్రమ ముగిసింది. ఈ సందర్భంగా సిద్ధిరాజు మాట్లాడుతూ కొన్ని ప్రాంతాలలో కొన్ని సహజ వనరులు మాత్రమే లభ్యమవుతాయని అలాంటి వాటిని పరిమితంగా ఉపయోగించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ భూపతి నాయుడు మాట్లాడుతూ సహజ వనరుల నిర్వహణ ప్రణాళికాబద్ధంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎన్నో అరుదైన సహజ వనరులు లభ్యమవుతున్నాయని తెలియజేశారు. పునరుత్పత్తి అయ్యే జలం సహజ వనరులను కూడా వాతావరణ పరిస్థితులకు తగినట్లుగా వాడుకోవాలని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిరంజన్ బాబు మాట్లాడుతూ సహజ వనరులు తగినంతగా లభ్యమవటం దేవుడిచ్చిన వరంగా భావించాలన్నారు. పునరుత్పత్తి కానీ సహజ వనరులను ఆచితూచి వాడుకుంటే మంచిదని చెప్పారు. సహజ వనరులను కాపాడుకోవడానికి అన్ని వర్గాలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసన్న రాజు అకడమిక్ డైరెక్టర్ లక్ష్మయ్య, బోధన సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# తిరుపతి జిల్లా

## ఘనంగా మల్లారెడ్డి డీమ్డ్ వర్సిటీ ఓరియంటేషన్



**రేణిగుంట, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రేణిగుంట మండలం మల్లవరం గ్రామం సమీపంలో నూతనంగా నిర్మించిన మల్లారెడ్డి(ఎంఆర్) డీమ్డ్ యూనివర్సిటీలో ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ ఫౌండర్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, యూనివర్సిటీ ఛాన్సలర్ మహేందర్ రెడ్డి, ఎంఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ భద్రారెడ్డి పాల్గొని ఓరియంటేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనివర్సిటీలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సులు, విద్యా అవకాశాలు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై విస్తృతంగా అవగాహన కల్పించారు. నూతనంగా చేరిన విద్యార్థులకు నిర్వాహకులు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అతిథులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన జనసేన మండల అధ్యక్షులు



**సూళ్లూరుపేట,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజకవర్గం జనసేన మండల అధ్యక్షులు ఆవుల రమణ, ఏపీసిసి స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జివివిఎస్ కమలాకర రావు ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆవుల రమణను కాంగ్రెస్ పార్టీ జివివిఎస్ కమలాకర్ రావు, తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు, కాంగ్రెస్ పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ కిరణ్ కుమార్‌లు ఆవుల రమణను కాంగ్రెస్ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. 2029 సార్వత్రిక ఎన్నికలలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రాహుల్ ప్రధాని అవ్వడం ఖాయమని తెలిపారు.

## 13 ఏళ్లలో దేశంలో అభివృద్ధి శూన్యం

### - ఏపీసిసి స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జివివిఎస్ కమలాకర రావు



**సూళ్లూరుపేట, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎన్డీఏ ప్రభుత్వం పేపర్ లీకులు, రామ మందిరం కుంభకోణాలు అణగారిన వర్గాలను అణచవేతే తప్ప 13 సంవత్సరాలలో భారత దేశంలో అభివృద్ధి శూన్యమని ఏపీసిసి స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జివివిఎస్ కమలాకర రావు తెలిపారు. స్పోర్ట్స్ సెల్ రాష్ట్ర పర్యటనలో భాగంగా నియోజకవర్గం ఇంచార్జ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బి బంగ్లా నుండి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో గల అంబేద్కర్ విగ్రహానికి, కాంగ్రెస్ పార్టీ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చైర్మన్ జీవివిఎస్ కమలాకరరావు, జిల్లా అధ్యక్షులు బాలగురువం బాబు మాట్లాడుతూ అటు దేశం, రాష్ట్రంలో గాని అభివృద్ధి జరగలేదని ఇరు పార్టీల నాయకులు దోచుకో దాచుకో అనే నినాదంతో పనిచేస్తున్నారని, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద తిరగబడ్డ విద్యార్థి లోకం రాష్ట్రంలో కూడా తిరగబడతారని తెలిపారు. విద్యార్థి లోకానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం వెంటనే కేంద్ర విద్యాశాఖ మంత్రిని రాజీనామా చేపించారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిమానులు పాల్గొన్నారు.

## పేద మహిళలకు చీరలు, ఆహారం పంపిణీ

**గూడూరు, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయం బాలాజీ నగర్ నందు చేడిమాల గ్రామానికి చెందిన జి. శ్రీనివాసులు, కుమారి దంపతులు తమ కుమారుడు లోహిత్ 5వ జన్మదినం సందర్భంగా మంగళవారం ప్రత్యేక సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లోహిత్ తల్లిదండ్రులు సుమారు 50 మంది పేద మహిళలకు ఉచితంగా చీరలు, వెజిటబుల్ బిర్యానీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ జన్మదినం వంటి ఇంట్లో జరిగే సంతోషకరమైన వేడుకలను పేదలకు సేవ చేస్తూ జరుపుకోవడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. చిన్నారి లోహిత్ ఆయురారోగ్యాలతో, సంతోషంగా వర్ధిల్లాలని ఈ సందర్భంగా పలువురు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రగతి సేవా సంస్థ కుటుంబ సభ్యులు, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, వాకాటి రామ్మోహన్రావు, పయ్యావుల మురళి నాయుడు, వాచ్ షాప్ రాము, కెఆర్ఎం, పోతిరెడ్డి పెంచలయ్య, కోట వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, విజయ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు పట్ల వివక్షత ఉండరాదు

### - దొరవారిసత్రంలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

**దొరవారిసత్రం,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, దిశా విభాగం సహకారంతో మంగళవారం నవజీవన్ ఆర్గనైజేషన్-సి.సి-పి.యు ప్రాజెక్టు ఆధ్వర్యంలో "ఇంటెన్సిఫైడ్ ఐ.ఇ.సి క్యాంపెయిన్" కార్యక్రమం ద్వారా హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన సదస్సును దొరవారిసత్రం లోని "యం.జె.పి.బి.సి.డబ్ల్యు జూనియర్ కాలేజ్" నందు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు మేనేజర్ కె.బాలాజి మాట్లాడుతూ, హెచ్ఐవి/ ఎయిడ్స్ వ్యాప్తి కారకాలు, ఎలా వ్యాపించదు, లక్షణాలు, అవి రాకుండా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులు పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలాగ సమాజంలో కలిసి జీవించాలి, సుఖ వ్యాధులు, చికిత్స గురించి, డ్రగ్స్ వాడకం వలన కలిగే ఇబ్బందులు, కండోమ్ ఉపయోగం గురించి అవగాహన కలిగించడం జరిగింది. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ యం. తిరుపతయ్య, వైస్ ప్రిన్సిపాల్ యం.సుజీవనరావు, లెక్చరర్ పి.కస్తూరి బాబు, ఓ.ఆర్.డబ్ల్యూలు కె.విజయశ్రీ, ఆర్.భువనేశ్వరి, ఎ.యన్.యమ్ జి.శ్రీలత, పి.ఇలు, 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తదుపరి క్రిష్ణాపురం ఏరియాలో హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కలిగించడం కోసం ర్యాలీ, మీటింగ్ నిర్వహించడం జరిగింది. ర్యాలీలో 100 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. వీరిలో 18 మంది ప్రజలుకు నవజీవన్ సంస్థ ఎ.యన్.యమ్ జి. శ్రీలత ద్వారా హెచ్ఐవి పరీక్షలు చేయించి వారి స్థితిని వారికి తెలియజేయడం జరిగింది.

## సుగాలి పార్వతికి వీల్‌చైర్ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలి

### - వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ డిమాండ్



**అనంతపురం, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సుగాలి ప్రీతి తల్లి సుగాలి పార్వతి చేపట్టనున్న వీల్‌చైర్ పాదయాత్రకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అనుమతి ఇవ్వాలని వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. పాదయాత్రకు అనుమతి కోరుతూ సుగాలి పార్వతి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతిని తిరస్కరించడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ సుగాలి పార్వతికి తన నిరసనను శాంతియుతంగా వ్యక్తం చేసే ప్రజాస్వామ్య హక్కు ఉందన్నారు. వీల్‌చైర్ పాదయాత్రకు అనుమతి నిరాకరించడం గిరిజనుల గొంతును అణచివేసే చర్యగా భావించాల్సి వస్తుందని అన్నారు. సుగాలి ప్రీతి ఘటనకు సంబంధించి బాధిత కుటుంబానికి న్యాయం, భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గోరంట్ల జడ్పిటిసి పాలే జయరాం నాయక్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సుగాలి ప్రీతి పేరును వాడుకొని అందలమెక్కిన పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు వారి కుటుంబానికి ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. సుగాలీ జాతి పట్ల ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజనులను అణగదొక్కే విధంగా వ్యవహరించరాదని, గిరిజనుల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తే సహించేది లేదని శ్రీనివాస్ నాయక్ హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే పునరాలోచించి సుగాలి పార్వతి వీల్‌చైర్ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళనలను మరింత బలోపేతం చేసి ఉధృతం చేస్తామని వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, పాలే జయరామ్ నాయక్ స్పష్టం చేశారు.

# షాదీ మహల్ పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలి



**కుప్పం,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ మంగళవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. కుప్పం షాదీ మహల్ పునరుద్ధరణ పనులు, కడ అధికారుల అతిథి గృహం సుందరీకరణ పనులు, పోగురుపల్లి పారిశ్రామిక ప్రాంతంలో మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. మొదటగా కుప్పం షాదీ మహల్‌ను సందర్శించిన ప్రాజెక్ట్ డైరెక్టర్ అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ పనుల పురోగతిని పరిశీలించారు. ముస్లిం సోదరులు వివాహాలు, ఇతర శుభకార్యక్రమాలను సౌకర్యవంతంగా నిర్వహించుకునేలా షాదీ మహల్‌ను అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్ష మేరకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే షాదీ మహల్ పునరుద్ధరణ పనులు దాదాపు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సమాజ ప్రతినిధులు మరికొన్ని అదనపు సౌకర్యాలు కల్పించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వారి సూచనలను పరిశీలించిన వికాస్ మర్మత్, అవసరమైన సౌకర్యాల్లో అధిక భాగాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. రాబోయే కొద్ది కాలంలోనే ముస్లిం కుటుంబాలు వివాహాలు, ఇతర శుభకార్యక్రమాలను షాదీ మహల్‌లో నిర్వహించుకునేలా మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## వాణిజ్య కార్యాలయాన్ని తరలించొద్దు

**- డీసీటీవో కార్యాలయం ఎదుట వైకాపా కార్యకర్తల ధర్నా**



**చిత్తూరు, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా కేంద్రంలోని వాణిజ్య పన్నుల కార్యాలయాన్ని తిరుపతికి తరలించకూడదని చిత్తూరు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎంసి విజయానంద రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వాణిజ్య పనుల శాఖ డిసిటిఓ కార్యాలయాన్ని తిరుపతికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కార్యాలయం ముందు వైకాపా శ్రేణులు ధర్నా నిర్వహించారు. చిత్తూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి ఎంసీ విజయానంద రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయానంద రెడ్డి మాట్లాడుతూ... ఎన్నో సంవత్సరాలుగా జిల్లా కేంద్రంలోని చిత్తూరులో కేంద్రం కొనసాగుతున్న వాణిజ్య కార్యాలయాన్ని తిరుపతికి తరలించడం దారుణమన్నారు. వెంటనే కార్యాలయ తరలింపు నిర్ణయాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వాణిజ్య కార్యాలయాన్ని తరలించకుండా చర్యలు తీసుకుంటామని స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం కార్యదర్శి గాయత్రిదేవి, రాష్ట్ర నాయకులు జ్ఞానజగదీష్, స్థానిక నాయకులు హరీషారెడ్డి, త్యాగరాజులు, భాగ్యలక్ష్మి, అప్పోజీ, ఎన్వీ రమణ, మనోజ్, మధుబాబు, ఆను, చందు, పూంగొడి, అంజలిరెడ్డి, నారాయణ, లక్ష్మణ్ బాబు, ప్రసన్న, కరుణాకర్, మురళి, నవాజ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీకి కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఘన నివాళి



**కుప్పం, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ బి.సి. నాగరాజ్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సమరంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోషించిన పాత్ర, ఆయన ధైర్యసాహసాలు, త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. 'జైహింద్' నినాదంతో దేశభక్తిని రగిలించిన నేతాజీ, యువతలో స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. 'నాకు రక్తం ఇవ్వండి.. నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను' అనే పిలుపుతో ప్రజల్లో పోరాట స్ఫూర్తిని రగిలించిన నేతాజీ, ఆజాద్ హింద్ ఫౌజ్‌కు నాయకత్వం వహించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని ముందుకు నడిపారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.భాస్కరన్, పరిశోధన - అభివృద్ధి విభాగాధిపతి డాక్టర్ జె.ఎన్. కోదండరామయ్య, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి జె. మాధవన్, గ్రంథాలయ విభాగాధిపతి డాక్టర్ సి.జె. శ్రవణ, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి ఎం. గంగాధరన్, వివిధ విభాగాధిపతులు, ప్రజాసంబంధాల అధికారి ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు.

# వైద్య విద్యలో సమన్వయానికి నాంది

**- అపోలోలో 'మెడ్ ఎడ్ సినర్జీ-2026' ప్రారంభం**



**చిత్తూరు,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఏఐఎంఎస్ఆర్), చిత్తూరులో మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఆధ్వర్యంలో "మెడ్ ఎడ్ సినర్జీ--2026" పేరిట రెండు రోజుల సిఎంఇ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథుల చేతుల మీదుగా దీప ప్రజ్వలనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ప్రారంభ కార్యక్రమంలో అపోలో విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం. నాగర్కర్ మాట్లాడుతూ, సమగ్ర వైద్య సేవల కోసం విభిన్న విభాగాల మధ్య సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. స్థానిక అవసరాల నుంచి గ్లోబల్ ప్రమాణాల వరకు అవగాహన కలిగి ఉండేలా అధ్యాపకులకు ముందుగా శిక్షణ ఇవ్వడం ద్వారా మెరుగైన బోధన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అపోలో నాలెడ్జ్ (స్ట్రాటజిక్ అడ్వయిజర్, అపోలో యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్ వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. వైద్య విద్య నిరంతరం మార్పులకు లోనవుతూ ఉంటుందని, కేవలం తరగతి గదిలోనే కాదు, ప్రాక్టికల్ శిక్షణ, ఆవిష్కరణల ద్వారా నేర్చుకునే విధానం మరింత అవసరమని తెలిపారు. ఆధునిక నిర్ధారణ పద్ధతులు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, విద్యార్థులు సమగ్ర నైపుణ్యాలు అలవరుచుకోవాలని సూచించారు. ఈ సదస్సులో దేశ, విదేశాల నుంచి ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొని కీలక అంశాలపై ఉపన్యాసాలు అందించారు. శ్రీహర్ చెన్నై డీన్ డాక్టర్ లత రవిచంద్రన్, అనస్థీషియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకుమార్, మంగళూరు కస్తూర్బ మెడికల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ ఆర్, సిఎంసి వెల్లూరు ప్రొఫెసర్ డాక్టర్ మార్గరెట్ శాంతి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. అలాగే వర్చువల్‌గా త్రి కె.ఎ.పి. విశ్వనాథం ప్రభుత్వ మెడికల్ కాలేజ్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. పార్థసారథి, ఒమన్ దేశం సోహార్ జాతీయ సైన్స్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ సిరాజ్ ఏ.ఎం. పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఆల్బర్ట్ జె. ఆగస్టిన్, ఏఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్ రమ్యా రామకృష్ణన్, అసోసియేట్ డీన్(రీసెర్చ్) డాక్టర్ ఉషా అడిగా, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగనాథ్ బి.జి., ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఏ.కిశోర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రమ్యా ఆర్, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, అపోలో నాలెడ్జ్ సిటీతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఐటీడీపీదే కీలక పాత్ర

**- ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం**



**కుప్పం, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో ఐటీడీపీ నాయకులు కీలక పాత్ర పోషించాలని ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షుడు పి.ఎస్. మునిరత్నం పిలుపునిచ్చారు. కుప్పం మండలం పాలారు గ్రామంలో నియోజకవర్గ ఐటీడీపీ నాయకులతో నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ఏర్పాటు చేసి, స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి.ఎస్. మునిరత్నం మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో ఐటీడీపీ నాయకులు ముందుండాలని సూచించారు. పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను ఆకర్షించడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, పారిశ్రామిక రంగాన్ని బలోపేతం చేయడం వంటి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందన్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ముఖ్యమంత్రి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి మార్పులను వాస్తవాలతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాల ప్రచారానికే పరిమితం కాకుండా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు, మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో ఐటీడీపీ నాయకులు చురుకైన పాత్ర పోషించాలన్నారు. పార్టీ కోసం, ప్రజల కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి కార్యకర్తకు ముఖ్యమంత్రి వారి కష్టానికి తగిన గుర్తింపు, ఫలితం అందిస్తారని పి.ఎస్. మునిరత్నం తెలిపారు. ఐటీడీపీ నాయకులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ విజయాలను సామాజిక మాధ్యమాలతో పాటు క్షేత్రస్థాయిలోనూ విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి శ్రీకాంత్, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఐటీడీపీ నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రపంచ దోమల దినోత్సవం

**పలమనేరు, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సబ్ యూనిట్ ఆఫీసర్ కే.సీ జయశంకర్ ఆధ్వర్యంలో మగ ఆరోగ్య కార్యకర్తల నెలవారి సమీక్ష సమావేశం యూపీహెచ్సి కాకతోపు నందు నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా లార్వాల్ సర్వే ఫార్మేట్ మీరు ఆశాలకు ఇచ్చి ఆశాలు అందరూ నోట్ బుక్ నందు అతికించుకుని దాని ప్రకారం లార్వాల్ సర్వే ఆశాలు చేయవలసినదిగా ఆదేశించారు.



అంతేకాకుండా ఈ సమావేశంలో ఆగస్టు 20వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా వారి వారి సచివాలయ పరిధిలో ప్రజలకు దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించవలసిందిగా ఆదేశించారు. సర్ రోనాల్డ్ రాస్ దోమల ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని హైదరాబాద్ నందు పరిశోధనలో కనుక్కున్నారు. సర్ రోనాల్డ్ రాస్ చేసిన పరిశోధన వలన కొన్ని లక్షల మంది ప్రజలు ప్రాణాలతో బయటపడగలిగారు. అంతే కాకుండా ఈ సమావేశంలో వెక్టార్ హైజిన్ యాప్ ఆదివారం అర్ధరాత్రి నుంచి శనివారం అర్ధరాత్రి వరకు వర్క్ చేస్తుందని ఫ్రైడే డ్రై డే యాప్ శుక్రవారం నుంచి ఆదివారం వరకు వర్క్ చేస్తుందని అందరూ ఆరోగ్య కార్యకర్తలకి ఆశా కార్యకర్తలు తెలియజేయవలసిందిగా ఆదేశించినారు. సమావేశం లో మగ ఆరోగ్య కార్యకర్తలు రమేష్,రమణ, నాగార్జున, మహబూబ్ బాషా, ఎరపరెడ్డి బలరాం,రవి పాల్గొన్నారు.

## యథేచ్ఛగా ఇసుక దోపిడీ

**- పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని డిమాండ్**



**పుంగనూరు,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**మండల పరిధిలోని భీమగానిపల్లి చెరువు, గంగమ్మకుంట తదితర ప్రాంతాల్లో ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణ లు వినిపిస్తున్నాయి. చెరువులు, కుంటలు, గుట్టలు, కాలువ గట్ల నుంచి ఇసుక, మట్టిని తవ్వి తరలిస్తూ, ఇసుకను విక్రయించి కొందరు సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ప్రధాన చెరువు కాలువ గట్లపై ఉన్న మట్టిని సైతం తరలిస్తున్నట్లు తెలుస్తోంది. కొత్తగా చేపట్టే పనులకు ఇసుకను తరలిస్తున్నామని చెబుతూ, కొందరు వ్యక్తిగత అవసరాలకు తరలించి విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకోవాలని, ఇసుకను అక్రమంగా తరలించి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# చిత్తూరు జిల్లా

## ఎయిర్‌పోర్టుకు సమీపంలో గ్రామకంఠం భూములను పరిరక్షించాలి

**కుప్పం, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉన్న గ్రామకంఠం భూములను పరిరక్షించాలని కోరుతూ శాంతిపురం మండల తహసీల్దార్ తనూజ, ఎంపీడీవో ప్రేమ్‌కుమార్‌లకు ఎంఆర్‌పీఎస్, భారతీయ అంబేద్కర్ సేన, దళిత నాయకులు మంగళ వారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. శాంతిపురం మండలం దండికుప్పం గ్రామపంచాయతీ పరిధిలోని సొన్నేగానిపల్లి రెవెన్యూ గ్రామ సర్వే నంబర్ 274/1లో ఉన్న సుమారు 4 ఎకరాల 15 సెంట్ల గ్రామకంఠం భూమిలో విలువైన తైలం, కర్పూరం తదితర చెట్లను సంబంధిత అధికారుల అనుమతులు లేకుండా నరికివేస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందిరానగర్ గ్రామానికి చెందిన వెంకటేశు, సావిత్రమ్మ కలిసి చెట్లను నరికివేసి ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. అలాగే అమ్మవారిపేట, దండికుప్పం రెవెన్యూ పరిధిలో ఎయిర్‌పోర్టుకు సంబంధించిన భూములకు అత్యంత సమీపంలో ఉన్న కోట్లాది రూపాయల విలువైన గ్రామకంఠం స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా దళిత ఉద్యమ నేత దేవరాజు మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉన్న గ్రామకంఠం భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విలువైన చెట్లను నరికివేసి విక్రయించిన అనంతరం భూమిని ఆక్రమించుకునే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. గ్రామకంఠం భూమిని అధికారులు తక్షణమే సర్వే చేసి, హద్దులను నిర్ధారించి, అక్రమ ప్రవేశాలను అడ్డుకునేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎయిర్‌పోర్టుకు సమీపంలోని గ్రామకంఠం స్థలాన్ని పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకుడు ఎం.రవీంద్ర, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ, దళిత ఉద్యమ నేత దేవరాజు మాదిగ, జనసేన పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ వేణు, భారతీయ అంబేద్కర్ సేన కుప్పం నియోజకవర్గ నాయకుడు నాగభూషణం, ఎంఆర్‌పీఎస్ శాంతిపురం మండల నాయకుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. గ్రామకంఠం స్థలాన్ని పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే గ్రామకంఠం భూముల పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమాలు కొనసాగిస్తామని నాయకులు హెచ్చరించారు.

## చంద్రబాబు చొరవతో రామకుప్పం విమానాశ్రయం

**- మూడు రాష్ట్రాలకు అభివృద్ధి కేంద్రం**

**రామకుప్పం, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఒకప్పుడు కుప్పం నియోజకవర్గానికి ముఖ్యమైన వాణిజ్య కేంద్రంగా వెలుగొందిన రామకుప్పం త్వరలో అంతర్జాతీయ స్థాయి అభివృద్ధికి నాంది పలకనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రామకుప్పంలో విమానాశ్రయ నిర్మాణానికి శ్రీకారం చుట్టనుండడంతో ఈ ప్రాంతం రూపురేఖలే మారిపోతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుప్పం విమానాశ్రయ నిర్మాణానికి బెంగళూరు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సంస్థ షరతులతో కూడిన అనుమతి ఇవ్వడంతో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కల నెరవేరబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం భరించే క్యాపెక్స్‌లో 15% మార్జిన్‌పై విమానాశ్రయ ఆపరేషన్, నిర్వహణ కోసం ఎన్‌వోకూడా లభించింది. దీంతో దాదాపు అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. మరో 2 నెలల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుంది. అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న రామకుప్పం వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాంతం. విమానాశ్రయం పూర్తయితే స్థానిక ప్రజల ఆర్థిక స్థితిగతులు గణనీయంగా మెరుగుపడతాయి. వ్యాపార వ్యవహారాలు ఊపందుకుంటాయి. రవాణా, లాజిస్టిక్స్, పర్యాటకం, ఉపాధి అవకాశాలు పెరిగి రామకుప్పం మండలం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. రైతుల పంటలకు మార్కెట్ విస్తరిస్తుంది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. చిన్న చిన్న వ్యాపారులు, హోటళ్లు, ట్రాన్స్‌పోర్ట్ రంగం ఊపందుకుంటుంది. "ఎయిర్‌పోర్ట్ వస్తే మా ఊరి బతుకులు మారుతాయి" అని ప్రజలు ఆనందంగా చెప్పుకుంటున్నారు. చంద్రబాబు గారి దూరదృష్టి వల్లనే ఈ అభివృద్ధి సాధ్యమవుతుందని స్థానిక నేతలు కొనియాడారు. విమానాశ్రయ నిర్మాణం పూర్తయ్యేందుకు ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రామకుప్పం త్వరలోనే మూడు రాష్ట్రాలకు కూడలిగా, అభివృద్ధికి చిరునామాగా మారనుంది.

## డ్రగ్స్ ఫ్రీ అవగాహన ర్యాలీకి శ్రీకారం

**కుప్పం,ఆగస్టు18(నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించే లక్ష్యంతో కుప్పంలోని రోసా మిస్టికా ఐసీఎస్ఈ కిండర్‌గార్టెన్ అండ్ స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం డ్రగ్స్ ఫ్రీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కడ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్, ఐఏఎస్ జెండా ఊపి ప్రారంభించారు.




ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వికాస్ మర్మట్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబం, సమాజ భవిష్యత్తుపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండటంతో పాటు, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోనూ అవగాహన కల్పించాలని కోరారు. డ్రగ్స్ రహిత కుప్పం, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉంటామని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో రోసా మిస్టికా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాల వ్యతిరేక నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.

## నోటీసులు అందుకున్న ఓటర్లందరూ విచారణకు హాజరు కావాలి

**- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్**

**అనంతపురం, ఆగస్టు18(నేటి మనదేశమ్ ప్రతినిధి):**ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లందరూ తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ పేర్కొన్నారు. కేటాయించిన తేదీన సరైన రికార్డులతో హాజరు కాకపోతే, సంబంధిత వ్యక్తులు ఓటు హక్కును కోల్పోతారన్నారు. నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తగిన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా 31.07.2026న డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయడం చేయగా, 31.07.2026 నుండి 30.08.2026 వరకు క్లెయిమ్ మరియు అభ్యంతరాలను దాఖలు చేయడానికి కాలపరిమితి ఉండగా, 31.07.2026 నుండి 28.09.2026 వరకు నోటీసు దశ/క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిష్కారం చేయడం, 03.10.2026న చివరి ప్రచురణ ఉంటుందని తెలిపారు. ఇందులో ఈఆర్ఓ / ఏఈఆర్ఓ కార్యాలయం నుండి నోటీసులు అందుకున్న ఓటర్లందరూ తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని, నోటీసు పొందిన ఓటర్లు నిర్ణీత తేదీన తగిన సరైన ఆధారాలు తీసుకొని కార్యాలయానికి వెళ్లి సమర్పించాల్సి ఉంటుందని, లేకపోతే ఓటు హక్కు ఉండదన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్క ఓటర్లు గమనించాలన్నారు.

## నెట్ జీరో హెల్దీ కాంపెస్లుగా 49 రెసిడెన్షియల్ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు చర్యలను వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి,ఆగస్టు18(నేటి మనదేశమ్ ప్రతినిధి):**శ్రీ సత్యసాయి జిల్లాలోని ఎంపిక చేసిన 49 రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లు, కేజీబీవీలను 'నెట్ జీరో హెల్దీ క్యాంపస్'గా తీర్చిదిద్దేందుకు వేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో డిఆర్‌డిఎ మరియు నెట్ జీరో హెల్దీ క్యాంపస్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ సభ్యులతో కలెక్టర్ కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..లి పాఠశాలల క్యాంపస్‌లలో మొక్కలు నాటడం, వర్షపు నీటి నిల్వ గుంతలు, కంపోస్ట్ గుంతల ఏర్పాటుకు సంబంధించి వివిధ దశల్లో ఉన్న పనుల అంచనా ప్రక్రియను రాబోయే మూడు రోజుల్లో పూర్తి చేసి, సాంకేతిక మంజూరుకు సమర్పించాలని ఆదేశించారు.పనుల పురోగతిని ప్రతిరోజూ సమీక్షించుకుంటూ సకాలంలో పూర్తయ్యేలా చూడాలని సూచించారు. అటవీ శాఖ అధికారులు అవసరమైన మొక్కల లభ్యతను వెంటనే పూర్తి చేసి, ప్లాంటేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు.పాఠశాలల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటుకు సంబంధించి 'నెడ్ క్యాప్' అధికారులు తక్షణమే అంచనాలు రూపొందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి,గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రామ్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య , నెడ్ క్యాప్ ప్రతినిధి కిషోర్, జిల్లా సోషల్ ఫారెస్ట్ అధికారి శ్రీనివాసులు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కరువు పరిస్థితులు ఎదుర్కొనేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### - కలెక్టర్ నిశాంత్‌కుమార్



**మదనపల్లె,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అన్నారు. వ్యవసాయం, ఉద్యాన పంటలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్లో ప్రాథమిక రంగాల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు.జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 4.60 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటివరకు 50,597 హెక్టార్లలోనే విత్తనాలు వేసినట్లు అధికారులు తెలిపారు. గత పది రోజులుగా వర్షాలు లేకపోవడంతో పంటల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సూచనలు అందించాలని కలెక్టర్ తెలిపారు. అవసరమైన విత్తనాలు, వ్యవసాయ ఇన్‌పుట్స్ సిద్ధంగా ఉంచాలని సూచించారు.ఈ-క్రాప్ నమోదు, పంటల బీమా ప్రక్రియలను గడువులోగా పూర్తి చేసి రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలన్నారు. టమాటా, కూరగాయలు, పూల సాగుపై వర్షాభావ ప్రభావాన్ని అంచనా వేస్తూ ఉద్యాన రైతులకు తగిన సలహాలు అందించాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా బోర్లు, పంప్‌సెట్లను అందుబాటులో ఉంచాలని, మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు. అవసరమైన చోట్ల ప్రత్యామ్నాయ నీటి వనరులు, ట్యాంకర్ల ద్వారా సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రజలకు, రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## ఎస్ఐఆర్-2026లో యువతకు ఓటరు నమోదుకు అవకాశం

### - ఆగస్టు 30లోపు దరఖాస్తు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్

**మదనపల్లె, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎస్ఐఆర్-2026లో భాగంగా 2026 ఆగస్టు 30 నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే అర్హులైన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. 2008 జూన్ 30లోపు జన్మించి, ఇప్పటివరకు ఓటరుగా నమోదు కాని అర్హులైన భారతీయ పౌరులు ఆగస్టు 30లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైన వారి పేర్లను అక్టోబర్ 3న ప్రచురించే ఎస్ఐఆర్-2026 తుది ఓటర్ల జాబితాలో చేర్చనున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో జిల్లాలో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం--6, విదేశాల్లో నివసిస్తున్న అర్హులైన భారతీయులకు ఫారం-6ఏ, పేర్ల తొలగింపునకు ఫారం-7, చిరునామా, నియోజకవర్గం, ఫొటో తదితర వివరాల మార్పులు, సవరణలకు ఫారం-8 వినియోగించుకోవచ్చన్నారు.ప్రత్యేక శిబిరాలకు హాజరు కాలేని వారు ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ voters.eci.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేరు ఉందో లేదో కూడా వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చన్నారు. అర్హులైన ప్రతి పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు కావాలని కలెక్టర్ కోరారు.

## నకిలీ పత్రాలతో వేధిస్తున్నారంటూ ఎస్పీకి ఫిర్యాదు



**మదనపల్లె,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వారసత్వంగా తమ కుటుంబానికి వచ్చిన వ్యవసాయ భూమికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ హర్షవర్ధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హనుమంతురెడ్డిలు జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు భూమికి సంబంధించిన రికార్డులను సమర్పిస్తూ ఫిర్యాదు చేసి, పత్రాల వాస్తవికతపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.మదనపల్లె రూరల్ మండలం పొన్నేటిపాలెం పరిధిలోని సర్వే నంబర్లు 386, 387, 388లో ఉన్న భూమికి సంబంధించిన రెవెన్యూ, భూ రికార్డులు తమ కుటుంబ సభ్యుల పేర్లతో ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల పరస్పర అంగీకారంతో ఇటీవల భూమి వాటాలను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. అయితే బాలకృష్ణారెడ్డి అనే వ్యక్తి 2011లో సదరు భూమిని కొనుగోలు చేసినట్లు పేర్కొంటూ కొన్ని పత్రాలను చూపుతున్నారని, వాటి చెల్లుబాటుపై తమకు అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదుదారులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ భూమికి సంబంధించి గతంలోనూ న్యాయపరమైన వివాదం కొనసాగిందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. తమకు ఇబ్బందులు, ప్రాణహాని ఉన్నట్లు కూడా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. సంబంధిత పత్రాలు, రికార్డులను పరిశీలించి సమగ్ర విచారణ జరిపించాలని కోరినట్లు చెప్పారు.ఫిర్యాదును పరిశీలించి, విచారణ అనంతరం తగిన న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

## 59 షాపు గదులకు వేలం.. 5 షాపులకు మాత్రమే స్పందన

### - మిగిలిన షాపురూములకు ఆగస్టు 27న బహిరంగ వేలం

**మదనపల్లె,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పురపాలక సంఘానికి చెందిన 59 ఖాళీ షాపురూములకు టెండర్ కమ్ వేలం, బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో ఐదు షాపురూములకు మాత్రమే పాటదారులు పాల్గొని వేలంలో ఆసక్తి చూపారు. మిగిలిన షాపు రూములకు ఎవరూ పాల్గొనకపోవడంతో వాటికి సంబంధించిన వేలాన్ని వాయిదా వేశారు. ఈ షాపు రూములకు ఈ నెల 27న ఉదయం 11 గంటలకు మదనపల్లె పురపాలక సంఘ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పురపాలక సంఘం అధికారులు తెలిపారు.




## నైపుణ్యాలతోనే మెరుగైన ఉద్యోగావకాశాలు

### -పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ: డా. ఎస్. రామలింగారెడ్డి
### - ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో క్యాంపస్ ఎంపికలు
### - క్యూస్పైడర్స్‌లో 38 మందికి ఇంటర్న్‌షిప్, ఉద్యోగాలు
### - రూ.3.6 లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపిక

**మదనపల్లె, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో సాంకేతిక, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా శిక్షణ అందిస్తున్నామని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ డైరెక్టర్ డా. ఎస్. రామలింగారెడ్డి తెలిపారు. విద్యార్థులు సాధించిన నైపుణ్యాలే మెరుగైన ఉద్యోగావకాశాలకు పునాది వేస్తాయని పేర్కొన్నారు. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రముఖ సంస్థ క్యూస్పైడర్స్ 38 మంది విద్యార్థులను ఇంటర్న్‌షిప్, ఉద్యోగాలకు ఎంపిక చేసింది. ఎంపికైన వారికి రూ.3.6 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పరిశీలించి ఎంపిక ప్రక్రియ నిర్వహించారు.ఈ సందర్భంగా డా. రామలింగారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు తరగతి గది విద్యతోపాటు ఉద్యోగ విపణికి అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కళాశాల ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. క్యూస్పైడర్స్‌లో 38 మంది ఎంపిక కావడం విద్యార్థుల ప్రతిభకు, అధ్యాపకుల కృషికి నిదర్శనమని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థలను కళాశాలకు తీసుకొచ్చి విద్యార్థులకు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ డా. పి. రాయుడు మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులు ఉద్యోగాల్లోనూ తమ ప్రతిభను నిరూపించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.క్యూస్పైడర్స్‌లో ఎంపికైన 38 మంది విద్యార్థులను డా. ఎస్. రామలింగారెడ్డి, డా. పి. రాయుడు అభినందించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం ప్రతినిధులు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## 30 ఏళ్ల సేవకు.. లీనా కుమారికి ప్రశంసా పత్రం



**మదనపల్లె, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వెలుగు ప్రత్యేక పాఠశాలలో మూడు దశాబ్దాలుగా దివ్యాంగ విద్యార్థుల కోసం నిబద్ధతతో సేవలందిస్తున్న ప్రిన్సిపాల్ పి. లీనా కుమారి సేవలను ప్రభుత్వం గుర్తించింది. ఆగస్టు 15న బీటీ కళాశాల మైదానంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి రాం ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ఆమెకు అత్యుత్తమ సేవ ప్రశంసా పత్రం అందజేశారు. అన్నమయ్య జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉపకరణాల స్టాల్‌ను మంత్రి రాం ప్రసాద్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, ఎస్పీ ధీరజ్ సందర్శించారు. ఈ సందర్భంగా బధిరులైన అఖిల్, చరణ్‌లకు హియరింగ్ ఎయిడ్స్, ఐశ్వర్య, అనూషలకు టీఎల్ఎం కిట్లు, శారీరక దివ్యాంగురాలు రెడ్డెమ్మకు వీల్‌చైర్ అందజేశారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణకిషోర్, ఆర్‌వో శ్రీకాంత్, వెలుగు సంస్థ కార్యదర్శి ఎం. ఉదయ్ మోహన్ రెడ్డి, ప్రిన్సిపాల్ పి. లీనా కుమారి, వెలుగు సిబ్బంది, దివ్యాంగులు, బధిరులు పాల్గొన్నారు.

## బాలికల్లో క్యాన్సర్ కట్టడికి హెచ్.పి.వి టీకా సురక్షితం

**పీలేరు, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బాలికల్లో నిశ్శబ్ద ముప్పును కలిగించే గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సరు కట్టడికి హెచ్.పి.వి వ్యాక్సిన్ సురక్షితమైనదని, పి.హెచ్.సి తలుపుల ప్రధాన వైద్యాధికారులు డా.శ్రీగిరీష బాలికలకు బరోసానిచ్చారు. డా.శ్రీ గిరీష మంగళవారం తలుపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు "క్యాన్సర్ కట్టడికి- హెచ్.పి.వి టీకా" అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.శ్రీగిరీష మాట్లాడుతూ 14 సంవత్సరాలు వయస్సు కలిగిన ప్రతి బాలిక తల్లిదండ్రుల సమ్మతిపై హెచ్.పి.వి టీకా తప్పనిసరి తీసుకోవాలని, గర్భాశయ ముఖద్వారా కాన్సర్ రాకుండా బాలికలకు దీర్ఘకాలిక రక్షణ కల్పించే ఈ టీకా సురక్షితం, సమర్థవంతమైనదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనిగంటల్లో తీసుకోవచ్చునని, ఖాళీ కడుపుతో రాకుండా తినిరావాలని, వెంట.. తల్లిదండ్రుల్లో ఒకరిని వెంటతీసుకుని ఆధార్ కార్డుతో రావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెచ్ఈఓ కొండయ్య, హెడ్మాస్టర్ రెడ్డప్ప, పర్యవేక్షకులు నాగమ్మ, ఏఎన్ఎం ఫామున్నీస, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## 'సంకల్ప్- సంపూర్ణ స్వాస్థ్య'పై అవగాహన



**పీలేరు, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని వీఎస్ఎన్ నెక్స్ట్‌జెన్ సీబీఎస్ఈ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించే 43వ 'సంకల్ప్ -సంపూర్ణ స్వాస్థ్య' కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతీయ బాల వైద్యుల అకాడమీ తిరుపతి, శ్రీ సత్యసాయి జిల్లా శాఖల ఆధ్వర్యంలో, పీలేరు ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ పీలేరు సహకారంతో కార్యక్రమం జరిగింది. ఐదో తరగతి, ఆపై తరగతుల విద్యార్థుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆరోగ్యకరమైన జీవన విధానంపై వైద్యులు అవగాహన కల్పించారు. సమతుల్య ఆహారం, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండటం, ఆహార పదార్థాలపై ఉన్న వివరాలను పరిశీలించి తీసుకోవడం, శారీరక వ్యాయామం, మొబైల్ ఫోన్ మరియు ఇతర తెరల వినియోగాన్ని పరిమితం చేయడం, తగినంత నిద్ర, మానసిక ఆరోగ్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండటం, కాలుష్యాన్ని నివారించడం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భారతీయ బాల వైద్యుల అకాడమీ సంపూర్ణ స్వాస్థ్య కార్యక్రమం రాష్ట్ర సమన్వయకర్త, ఐఏపీ శ్రీ సత్యసాయి జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె. కేశవులు ముఖ్య వక్తగా పాల్గొన్నారు. పీలేరు ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ తేజస్రి తదితర వైద్యులు విద్యార్థులకు వివిధ ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే ఆరోగ్యంపై సరైన అవగాహన పెంపొందించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, వైద్యులు, నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## త్యాగమూర్తి శర్మ సేవలు చిరస్మరణీయం

### - సాహితీ, కళారంగానికి ఆయన చేసిన కృషి మరువలేనిది
### - మదనపల్లె రచయితల సంఘం ఆధ్వర్యంలో ఘన నివాళులు



**మదనపల్లె, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె రచయితల సంఘం (మ.ర.సం)కు మూడు దశాబ్దాలపాటు సేవలందిస్తూ సాహిత్య, లలిత కళల అభివృద్ధికి కృషి చేసిన పురాణం త్యాగమూర్తి శర్మ సేవలను రచయితలు, సాహితీ మిత్రులు స్మరించుకున్నారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ నివాళులర్పించారు. మ.ర.సం. వ్యవస్థాపక సంయుక్త కార్యదర్శిగా త్యాగమూర్తి శర్మ సుదీర్ఘకాలం సేవలందించారని సభ్యులు గుర్తుచేశారు. ప్రతి ఏడాది ఉగాది, శ్రీకృష్ణ జయంతి వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ మదనపల్లె ప్రజలకు లలిత కళలపై ఆసక్తిని పెంపొందించారని పేర్కొన్నారు. కళారంగంలో ఎంతోమంది శిష్యులను తీర్చిదిద్ది తనదైన ముద్ర వేశారని తెలిపారు. త్యాగమూర్తి శర్మ సేవలు మదనపల్లె సాహితీ, కళా రంగానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అభిప్రాయపడ్డారు. సమావేశానికి ఈ.ప్రసాద్ అధ్యక్షత వహించారు. మోహన్‌రెడ్డి, వాసుదేవరావు ప్రార్థనా గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీకృష్ణ జయంతి సమాఖ్య అధ్యక్షురాలు శ్రీమతి స్వర్ణలతా రమేష్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.మ.ర.సం. ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి కార్యక్రమాన్ని నిర్వహించారు. బి. శ్రీనివాసులు,శరత్‌బాబు, రామ్మోహన్ నాయుడు, నాగభూషణం,హేమలత, వి.ఎం. నాగరాజు పాల్గొన్నారు.



# అన్నమయ్య జిల్లా

## ప్రతి మండలానికి తాగునీటి కోసం రూ.కోటి కేటాయించండి

### - అసెంబ్లీలో ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి డిమాండ్



**పీలేరు, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లి జిల్లా పరిధిలోని 5 నియోజకవర్గాల ప్రజల తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన, మదనపల్లి జిల్లాలోని పీలేరు, మదనపల్లి, పుంగనూరు, తంబళ్లపల్లి, రాయచోటి 5 నియోజకవర్గాల పరిధిలోని ప్రతి మండలానికి త్రాగునీటి కోసం కోటి రూపాయలు కేటాయించాలని విన్నవించారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా బోర్లు అడుగంటి పోయాయని, రాబోయే వేసవిలో తీవ్ర నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని, ఆందోళన వ్యక్తం చేశారు. ముందస్తు చర్యలు తీసుకోకుంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. ప్రజల దాహార్తిని తీర్చడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, ఈ విషయంలో వెంటనే నిధులు విడుదల చేసి శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కోరారు. గతంలో మదనపల్లి జిల్లా కోసం ఎన్నో పోరాటాలు చేశామని అధికారంలోకి వచ్చిన వెంటనే మదనపల్లి జిల్లా చేసిన ఘనత తమదేనని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మదనపల్లిని జిల్లాగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## అన్నదానంతో బాలాజీ పుట్టినరోజు వేడుకలు

### - పీలేరు అన్న క్యాంటీన్‌లో పేదలకు ఉచిత టిఫిన్, భోజనం

**పీలేరు,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణం సైనిక్ నగర్‌కు చెందిన శ్రీ వెంకటేశ్వర బోర్ వెల్స్ నిర్వాహకులు జు. సుబ్రమణ్యం కుమారుడు బాలాజీ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలోని అన్న క్యాంటీన్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి పేదలు, ఆటో డ్రైవర్లు, రోజువారి కూలీలు, వృద్ధులు తదితరులకు ఉచితంగా అన్నం వడ్డించారు. బాలాజీ తల్లిదండ్రులు స్వయంగా పాల్గొని అందరికీ ప్రేమతో వడ్డించారు. ఈ సందర్భంగా ఈ.సుబ్రమణ్యం మాట్లాడుతూ, "పేదలకు అన్నదానం చేయడం కంటే గొప్ప పుణ్యం మరొకటి లేదు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులు, శుభ కార్యాలను ఇలాంటి సేవా కార్యక్రమాలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పీలేరు నియోజకవర్గ బీసీ అధ్యక్షులు వసంతల రాజా, ఈ.లౌక్య తదితరులు పాల్గొని బాలాజీని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులకు శిక్షణ


### - మిట్స్-అప్రోటెక్ ఆర్అండ్‌డీ సొల్యూషన్స్ మధ్య ఒప్పందం
### - ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామనాథన్ వెల్లడి




**మదనపల్లె/ కురబలకోట, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పరిశ్రమ అవసరాలకు అనుగుణం గా విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాల ను తీర్చిదిద్దడంతో పాటు వారికి ప్రాయోగిక అనుభవం, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో మిట్స్ డీమ్డ్ టు బి యూని వర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, పరిశ్రమల సంబంధాల విభాగం ఆధ్వర్యంలో చెన్నైకి చెందిన అప్రోటెక్ ఆర్అండ్‌డీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ తెలిపారు. పరిశ్రమలు- విద్యాసంస్థల భాగస్వామ్యంతో విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెరగడంతో పాటు ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం కలుగుతుందని రామనాథన్ పేర్కొన్నారు. అప్రోటెక్ ఆర్అండ్‌డీ సొల్యూషన్స్ డైరెక్టర్ ఎస్.ప్రభు మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యసనం, దత్తాంశ శాస్త్రం, మేఘ గణన, సైబర్ భద్రత వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో పరిశ్రమ ఆధారిత శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణతో పాటు ధ్రువపత్ర కోర్సులు, పరిశ్రమ ప్రాజెక్టులు, విద్యార్థి శిక్షణ కార్యక్రమాలు, ఉద్యోగ అవకాశాల కల్పన, పరిశోధనా సహకారం అందిస్తామని చెప్పారు.విద్యార్థులు వాస్తవ పరిశ్రమ ప్రాజెక్టులపై పనిచేయడం ద్వారా సాంకేతిక, వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుందని ప్రభు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీదేవి, అప్రోటెక్ ఆర్అండ్‌డీ సొల్యూషన్స్ డైరెక్టర్ ఎస్. ప్రభు పరస్పరం అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.కార్యక్రమంలో కంప్యూటింగ్ విభాగం డీన్ డాక్టర్ సి.చంద్ర ప్రకాష్ గుప్తా, పరిశ్రమల సంబంధాల సహాయ సంచాలకుడు పి.ఎం. బాలాజీ, సమన్వయకర్తలు డి. రామలింగం, డాక్టర్ ఆర్. సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారమే రిజిస్ట్రేషన్


### - కుటుంబ భాగపరిష్కార దస్తావేజుపై సబ్ రిజిస్ట్రార్ వివరణ



**మదనపల్లె, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నంబర్ 7639/2026కు సంబంధించి కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ ఎం. గురుస్వామి వివరణ ఇచ్చారు. సదరు దస్తావేజు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే పూర్తయిందని ఆయన తెలిపారు. పొన్నూటిపాళ్యం గ్రామానికి సంబంధించి మదనపల్లె తహసీల్దార్ కార్యాలయం నుంచి అందిన ఖాతా నంబర్లు 1424, 944, 1391ల్లో టి. సుజాత, టి. రెడ్డెమ్మ, టి. హనుమంతు రెడ్డిలకు సంబంధించిన భూ హక్కుల రికార్డులు ఉన్నట్లు తెలిపారు. ఆయా రికార్డుల్లోని 1-బి, అడంగల్ వివరాల్లో నమోదైన సర్వే నంబర్లు, విస్తీర్ణాల ఆధారంగా కుటుంబ భాగపరిష్కార దస్తావేజు కోసం సంబంధిత వ్యక్తులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.ప్రభుత్వం నిర్దేశించిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులను నిబంధనల మేరకు చెల్లించిన అనంతరమే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు గురుస్వామి పేర్కొన్నారు. కుటుంబ భాగపరిష్కార దస్తావేజుకు అనుగుణంగా రెవెన్యూ శాఖలో జరిగిన ఆటో మ్యుటేషన్ ప్రక్రియ కూడా అమల్లో ఉన్న నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారమే జరిగినట్లు తెలిపారు.స్లాట్ బుకింగ్ అనంతరం సంబంధిత రెవెన్యూ రికార్డులను పరిశీలించినట్లు సబ్ రిజిస్ట్రార్ వివరించారు. ఈ-కేవైసీ, బయోమెట్రిక్ విధానంలో సంబంధిత వ్యక్తుల వేలిముద్రలు తీసుకుని, సాక్షుల సమక్షంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు.దస్తావేజుకు సంబంధించిన అంశంపై వచ్చిన కొన్ని ప్రచారాల్లో ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రతిబింబించలేదని ఆయన పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ఎవరికైనా సందేహాలు ఉంటే సంబంధిత కార్యాలయం ద్వారా వివరాలను తెలుసుకోవచ్చని సూచించారు. వాస్తవాలను పరిశీలించిన అనంతరం మాత్రమే నిర్ణయానికి రావాలని, ప్రచారాలను ఆధారంగా చేసుకుని అపోహలకు గురికావద్దని ప్రజలకు సూచించారు.




# అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా





కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే ఈ సినిమాలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమాలో 'మల్లెపూల పల్లకి బంగారు పల్లకి' అంటూ సాగే పాటలో రామ్ చరణ్ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తారని.. కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై రామ్‌చరణ్ టీమ్ తాజాగా స్పందించింది. అవి రూమర్స్ అంటూ ఖండించింది. అసత్యాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేసింది.

## డీసీ చిత్రంపై అల్లు అర్జున్ ప్రశంసలు




తమిళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టిస్తున్న 'డీసీ' చిత్రంపై టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ప్రశంసలు కురిపించారు. ఇప్పటికే రూ.85 కోట్ల వసూళ్లను సాధించి, రూ.100 కోట్ల క్లబ్ దిశగా దూసుకెళ్తున్న ఈ సినిమాపై ఆయన సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'ఈ సినిమా ఒక అద్భుతమైన తమిళ క్లాసిక్ అని, సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా చూడాల్సిన చిత్రమని ఆయన కొనియాడారు. ఈ చిత్రాన్ని అర్థం చేసుకోగలిగే వారికి ఇది ఒక కవితలా ఉంటుందని' బన్నీ అభివర్ణించారు. ఇక దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ మేకింగ్ స్టైల్‌కు తాను ఫిదా అయ్యానని తెలుపుతూ, చిత్ర బృందం మొత్తానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ముఖ్యంగా ఈ సినిమాకు ప్రాణం పోసిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ పనితీరును అబ్సల్యూట్ మాస్టర్ బూస్టర్‌గా బన్నీ అభివర్ణించారు. సాంకేతికంగా కూడా ఈ చిత్రం అత్యున్నత ప్రమాణాలతో తెరకెక్కిందని ఆయన పేర్కొన్నారు. నటీనటుల విషయానికి వస్తే, వామికా గబ్బి నటన అద్భుతమని మెచ్చుకుంటూనే, ప్రధాన పాత్రలో హీరోగా నటించిన దర్శకుడు లోకేష్ కనగరాజ్ నటనను కూడా ప్రత్యేకంగా ప్రశంసించారు. తన మిత్రుడు లోకేష్ కనగరాజ్ తనకు ఎల్లప్పుడూ ఒక గొప్ప మద్దతుగా ఉంటారని అల్లు అర్జున్ సంతోషం వ్యక్తం చేశారు. విడుదలైన కొద్ది కాలంలోనే బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను రాబడుతూ, సినీ వర్గాల్లో 'డీసీ' మూవీ హాట్ టాపిక్‌గా మారింది.

## ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్
### రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్




టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.

## సంక్రాతి బరిలో మెగా 158 మూవీ




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్– శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.



# బిజినెస్ న్యూస్



## టాటా సన్స్ ఏజీఎం వాయిదా.. చరిత్రలో తొలిసారి




టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం అనుకున్నట్లుగానే వాయిదా పడింది. తగినంత కోరమ్ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. టాటా గ్రూపు కంపెనీలకు హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ (ఘ్ము ంశీఅం) చరిత్రలో ఇలా జరగడం ఇదే తొలిసారి. మళ్లీ ఎప్పుడు ఏజీఎం నిర్వహించాలనే అంశంపై బోర్డు సభ్యులతో ఛైర్మన్ సంప్రదింపులు జరిపి నిర్ణయం తీసుకోనున్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 18న బాంబే హౌస్‌లో నిర్వహించ తలపెట్టిన ఏజీఎంకు ఛైర్మన్ చంద్రశేఖరన్, కొందరు బోర్డు సభ్యులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. నోయల్ టాటా, మెహ్లీ మిస్త్రీ సహా మరికొందరు సైతం ఆన్‌లైన్‌లో హాజరయ్యారు. అయితే, మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ విధించిన నిషేధం కారణంగా టాటా సన్స్‌లో కీలక వాటాదారు అయిన సర్ రతన్ టాటా ట్రస్ట్ (ఎస్ఆర్‌టీటీ) తన ప్రతినిధిని నామినేట్ చేయడానికి అవకాశం లేకుండా పోయింది. దీంతో ట్రస్ట్ ప్రతినిధి గైర్హాజరీతో కోరమ్ లేకపోవడంతో ఏజీఎం వాయిదా పడింది. ఇదే విషయాన్ని మరో ట్రస్ట్ అయిన సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్ ముందుగానే టాటా సన్స్‌కు తెలియజేసింది. దీంతో ఏజీఎం వాయిదా ముందుగా ఊహించినదే. వాస్తవానికి ఈ సమావేశంలో టాటా సన్స్‌కు ప్రస్తుత చంద్రశేఖరన్‌ను డైరెక్టర్‌గా రీనామినేట్ చేసే అంశం పరిశీలనతో పాటు, 2025–26 ఆర్థిక సంవత్సర స్టాండలోన్, ఏకీకృత ఖాతాలను పరిశీలించి, ఆమోదించాల్సి ఉంది. డివిడెండునూ ప్రకటించాల్సి ఉంది.

## వార్ ఎఫెక్ట్: పెరగనున్న కోల్గేట్ ధరలు




ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీ కోల్గేట్–పామోలివ్ తన ఉత్పత్తుల ధరలను పెంచే యోచనలో ఉంది. రానున్న త్రైమాసికాల్లో ధరలు పెంచేందుకు సిద్ధమవుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ముడిసరుకుల వ్యయం పెరగడమే ఇందుకు కారణం. కంపెనీ లాభాల మార్జిన్లను కాపాడుకొనేందుకు ఈ ధరల పెంపు అనివార్యమైందని కంపెనీ పేర్కొన్నట్లుగా పలు అంతర్జాతీయ మీడియా కథనాలు తెలిపాయి. "గతేడాది జీఎస్‌టీ సవరణ వల్ల ఉత్పత్తుల బరువును పెంచాం. ప్రస్తుతం రూ.10, రూ.20 నుంచే కోల్గేట్ ఉత్పత్తులను విక్రయిస్తున్నాం. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థి తులతో ముడి సరుకుల సరఫరాపై ప్రభావం పడుతోంది. ఇప్పుడు ధరలు పెంచకపోతే భవిష్యత్తులో ద్రవ్యోల్బణ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని కంపెనీ సీఈవో అండ్ ఎండీ ప్రభా నరసింహన్ తెలిపారు. అలాగే, కంపెనీ టూత్ బ్రష్, టూత్ పేస్ట్ రెండింటిలోనూ ప్రీమియం ఉత్పత్తులను తయారు చేయడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. మరోవైపు, కోల్గేట్–పామోలి వ్‌కు చెందిన పర్సనల్ కేర్ బ్రాండ్ పామోలివ్ మార్కెట్ పనితీరుపై ప్రభా నరసింహన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కంపెనీ ఉత్పత్తుల మార్కెట్‌ను మరింత బలోపేతం చేసుకునేందుకు బాంబే షేవింగ్ కంపెనీతో జట్టు కట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ కంపెనీ పతాంజలి, హేలియోన్ కంపెనీకి చెందిన సెన్సోడైన్, హిందూస్థాన్ యుని లీవర్‌కు చెందిన పెప్సోడెంట్ ఉత్పత్తులతో పోటీపడుతోంది.

## మన స్టాక్‌మార్కెట్‌ను కొల్లగొట్టిన జేన్‌స్ట్రీట్‌కు ఊహించని షాక్




'పొట్టోడిని పొడుగోడు కొడితే.. పొడుగోడిని పోచమ్మ కొట్టిందంట'.. సరిగ్గా ఈ సామెత అమెరి కాకు చెందిన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ జేన్‌స్ట్రీట్‌కు సరిపో తుందేమో. భారత స్టాక్ మార్కెట్‌ను కొల్లగొట్టి దేశం లో నిషేధం ఎదుర్కొన్న ఈ సంస్థకు.. వాల్‌స్ట్రీట్‌లో తాజా గా గట్టి షాక్ తగిలింది. నేరు గా ఈ కంపెనీ నష్టపోన ప్పటికీ.. నమ్మి పెట్టుబడి పెట్టిన ఓ హెడ్జ్‌ఫండ్ భారీగా నష్టపోవడంతో జేన్‌స్ట్రీట్‌కూ భారీగానే నష్టం వాటిల్లింది. వక్రమార్గంలో భారత స్టాక్ మార్కెట్‌ను మోసం చేసిన ఈ సంస్థకు.. ఏడాది తిరగకముందే అంతకు రెండు, మూడింతలు నష్టపోవడం గమనార్హం. ఇంతకీ ఏం జరిగిందంటే? ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిశోధకుడైన 24 ఏళ్ల లియోపోల్డ్ ఆస్చెన్‌బ్రెన్నర్ ఆస్చెన్‌బ్రెన్నర్ సిట్యువేషనల్ అవేర్‌నెస్ పేరిట హెడ్జ్ ఫండ్‌ను స్థాపించాడు. 19 ఏళ్లకే కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రుడైన ఈయన.. గతంలో ఎఫ్‌టీఎక్స్, ఓపెన్‌ఏఐలలో పనిచేశాడు. అయితే, సెమీకండక్టర్ షేర్లపై సిట్యువేషనల్ అవేర్‌నెస్ పెట్టిన పెట్టుబడులు బెడిసికొట్టడంతో ఈ సంస్థ తీవ్ర సంక్షోభంలో పడింది. దీంతో ఈ హెడ్జ్ ఫండ్‌లో పెట్టుబడులు కలిగిన జేన్‌స్ట్రీట్‌కూ భారీగా నష్టం వాటిల్లింది.

ఏం జరిగింది?

సిట్యువేషనల్ అవేర్‌నెస్ సంస్థ జూన్ నెలలో శాన్‌డిస్క్‌లో 5.7 బిలియన్ డాలర్లు, మైక్రాన్ టెక్నాలజీలో 5.6 బిలియన్ డాలర్లు చొప్పున పెట్టుబడులు పెట్టింది. జులైలో శాన్‌డిస్క్ షేర్లు 47 శాతం, మైక్రాన్ షేర్లు 29 శాతం మేర కుప్పకూలాయి. దీంతో కేవలం ఒక్క నెలలోనే పోర్ట్‌ఫోలియో విలువ దాదాపు 67 శాతం ఆవిరైంది. కంపెనీ పోర్ట్‌ఫోలియోలో దాదాపు 10 శాతం వాటా కలిగిన బ్లూమ్ ఎనర్జీ షేర్లు కూడా అదే నెలలో 31 శాతం పడిపోయాయి. టీఎస్ఎంసీ, నెబియస్ షేర్లలో పెట్టిన పెట్టుబడులు కూడా నష్టాలను మిగిల్చాయి. ఫలితంగా 45 బిలియన్లుగా ఉన్న ఫండ్ విలువ దాదాపు 10 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఈ పతనం కారణంగా వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్ దాదాపు 15 బిలియన్ డాలర్లు నష్టపోయినట్లు తెలిసింది. అంటే భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ.1.25 లక్షల కోట్లకు పైమాటే.

ఇదీ జేన్ స్ట్రీట్ కథ

మన స్టాక్‌మార్కెట్‌లో చట్టవ్యతిరేక విధానాల ద్వారా, అక్రమంగా రూ.వేల కోట్లు ఆర్జించినట్లు తేలడంతో గతేడాది జులైలో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిషేధం విధించింది. స్టాక్‌మార్కెట్లో ఇండెక్స్ (ఆయా రంగాల సూచీ) ధరలను ప్రభావితం చేసి, మదుపరుల సొమ్మును ఈ సంస్థ కొల్లగొట్టింది. దాదాపు రూ.44,358 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు సెబీ నిర్ధారించింది. కొన్నింట్లో వచ్చిన నష్టాలను మినహాయిస్తే నికరంగా రూ.36,671 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు గుర్తించింది. దీంతో రూ.4,843 కోట్లు జరిమానాగా చెల్లించాలని సెబీ ఆదేశించింది. ఈ పరిణామం జరిగిన ఏడాది తర్వాత జేన్‌స్ట్రీట్‌కు తన పెట్టుబడుల రూపంలో భారీ మొత్తంలో నష్టం వాటిల్లడం కొసమెరుపు.

## యూట్యూబ్‌లో వ్యూస్ లెక్కించే విధానంలో కీలక మార్పు





గూగుల్‌కు చెందిన ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ వ్యూస్ లెక్కించే విధానంలో కీలక మార్పు తీసుకురాబోతోంది. వీడియో ప్రారంభమైన తొలి ఫ్రేమ్ నుంచే ఇకపై వీడియో వ్యూ కౌంట్ ప్రారంభవుతుంది. అన్ని ఫార్మాట్లకు వ్యూస్ లెక్కింపు విధానంలో ఏకరూపత ఉండాలన్న ఉద్దేశంతో ఈ మార్పు చేపడుతోంది. ఆగస్టు 24 నుంచి ప్రపంచవ్యాప్తంగా ఈ విధానం అమల్లోకి రానుంది. యూట్యూబ్‌లో ప్రస్తుతం లాంగ్ ఫార్మాట్ వీడియోలను ఎవరైనా 30 సెకన్లు పాటు వీక్షిస్తేనే వ్యూగా లెక్కిస్తున్నారు. ఇకపై వీడియో ప్రారంభమైన తొలి ఫ్రేమ్ నుంచే వ్యూగా కౌంట్ చేస్తారు. యూట్యూబ్ షార్ట్స్‌లో ఈ విధానాన్ని యూట్యూబ్ ఇప్పటికే అమలు చేస్తోంది. కొత్తగా లాంగ్ ఫార్మాట్ వీడియోలకూ వర్తింపజేయనుంది. వీడియో ప్లే అయిన వెంటనే, లేదా ఎవరైనా లైవ్‌స్ట్రీమ్‌లోకి ప్రవేశిం చిన వెంటనే ఇకపై పబ్లిక్ వ్యూ నమోదవుతుంది. కేవలం వీడియో ప్లే అయిన తర్వాత చూసి వెళ్లిపోయిన వారిని, ఎక్కువ సమయం చూసిన వారిని వేర్వే రుగా చూపించేందుకు యూట్యూబ్ అనలిటిక్స్‌లో 'ఎంగేజ్డ్ వ్యూస్' ఆప్షన్‌ను ఉంటుంది. దీనిద్వారా నిజంగా తమ కంటెంట్‌ను ఎంతమంది చూస్తున్నారో క్రియేటర్లు తెలుసుకోగలుగుతారు. అయితే, ఈ మార్పు వల్ల ఆదాయం, మానిటైజేషన్‌పై ఎలాంటి ప్రభావం ఉండబోదని యూట్యూబ్ స్పష్టంచేసింది. యూట్యూబ్ పార్టనర్ ప్రోగ్రామ్‌ను అనుసరించే చెల్లింపులు కొనసాగుతాయని స్పష్టంచేసింది. ఈ మార్పు వల్ల యూజర్లకు వచ్చే ప్రయోజనం ఏమీ లేనప్పటికీ.. క్రియేటర్లకు మాత్రం ఈ ఫీచర్ ఉపయోగపడుతుంది.

# భక్తులకు అన్నదానం



**పలమనేరు, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ సమీపంలోని గంటావూరు బీసీ కాలనీలో వెలసియుండు శ్రీ తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ డాక్టర్ మురుగన్ సహకారంతో తిరుపతి గంగమ్మ దేవస్థానంలో విశేష పుష్ప అలంకారంతో గంగమ్మ తల్లి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పక్కనే ఉన్న ముత్యాలమ్మ గుడిలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగమ్మ తల్లిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలను రాము స్వామి ప్రజలకు భక్తులకు పంచిపెట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని స్వర్ణ నంది అవార్డు గ్రహీత డాక్టర్ మురుగన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.




# సోనోవిజన్ షోరూంలో దొంగతనం కేసులో నలుగురి అరెస్టు

**- పశ్చిమ బెంగాల్‌లోని ఫరక్కా సమీపంలో అరెస్టు - తిరుపతిలో మరో నిందితుడిని అరెస్ట్**

**- రూ.1.50 కోట్ల విలువైన 195 మొబైల్ ఫోన్లు, 5 ట్యాబ్‌లు స్వాధీనం - దర్యాప్తు బృందాలకు రివార్డులు అందజేసిన జిల్లా ఎస్పీ**







**తిరుపతి, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎయిర్ బైపాస్ రోడ్డులోని సోనోవిజన్ మొబైల్ షోరూం నందు 8న తెల్లవారుజామున ఎవరికీ అనుమానం రాకుండా గోడకు రంధ్రం వేసి, కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు సినీఫక్కీలో ప్రవేశించి సుమారు రూ.1.50 కోట్ల విలువైన అత్యంత ఖరీదైన మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లను దొంగతనం చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, తిరుపతి అడిషనల్ ఎస్పీ అడ్మిన్(క్రైమ్ ఇంచార్జి) ఆర్ల శ్రీనివాసులు, తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. సంఘటనపై తిరుపతి క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం జరిగిన తీరును బట్టి దేశంలోని మొబైల్ షోరూమ్‌లను లక్ష్యంగా చేసుకుని భారీ స్థాయిలో మొబైల్ ఫోన్లను చోరీ చేసి ఇతర దేశాలకు తరలించే ముఠాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి, కచ్చితమైన సమాచారాన్ని సేకరించారు. జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల స్థానిక పోలీసుల సహకారంతో లభించిన కచ్చితమైన సమాచారంతో, నిందితులు చోరీ సొత్తుతో కలిసి బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలోని మాల్దా ప్రాంతానికి చేరుకుంటున్నట్లు గుర్తించారు. దీంతో పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఫరక్కా సమీపంలో దర్యాప్తు బృందాలు నేరం జరిగిన ఆరు రోజులలోపే ముగ్గురు ప్రధాన నిందితులతో పాటు ఒక రిసీవర్‌ను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నాయి. వారి వద్ద నుంచి సోనోవిజన్ మొబైల్ షోరూంలో చోరీకి గురైన 175 మొబైల్ ఫోన్లు, 5 ఆఫిల్ ట్యాబ్స్ స్వాధీనం చేసుకున్నారు. 14వ తేదీన సంబంధిత జాంగిపూర్ మెజిస్ట్రేట్ ముందు నిందితులను హాజరుపరిచి, వారిని తిరుపతి 5వ అదనపు సివిల్ జడ్జి ముందు హాజరుపరచేందుకు ట్రాన్సిట్ వారంట్ పొంది, నిందితులతో పాటు చోరీకి గురైన మొబైల్ ఫోన్లు, ఇతర వస్తువులను తిరుపతికి తీసుకువచ్చారు. విచారణలో నిందితుల ద్వారా లభించిన సమాచారంతో మంగళవారం ఉదయం నిందితుల్లో ఒకరైన టోనిక్ షేక్ సోదరుడు అనికుల్ షేక్ను తిరుపతి-రేణిగుంట రోడ్డులోని నారాయణాద్రి హాస్పిటల్ సమీపంలో అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 20 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను తిరుపతి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నందు ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు వివరాలను వెల్లడించారు.

కేవలం ఆరు రోజుల్లోనే కేసును ఛేదించడంలో కీలక పాత్ర పోషించిన తిరుపతి అడిషనల్ ఎస్పీ అడ్మిన్ (క్రైమ్ ఇంచార్జి) ఆర్ల శ్రీనివాసులు, తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్లు శివకుమార్ రెడ్డి, అబ్బన్న, ఎస్ఐలు నాగార్జున రెడ్డి, సుబ్బారెడ్డి, చిరంజీవి, సిబ్బంది మోహన్ కుమార్, చంద్రశేఖర్, గౌస్ ఆరిఫ్, మునిరాజు, గోపికృష్ణ, మురళిలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, తగిన రివార్డులను అందజేశారు. అరెస్టు అయిన వారిలో జార్ఖండ్ రాష్ట్రం సాహెబ్‌గంజ్ జిల్లాకు చెందిన ఆలమ్ షేక్(49), పియర్పూర్‌కు చెందిన ఎం.డి. బసీరుద్దీన్ షేక్(66), ఖట్టి టోలాకు చెందిన టోనిక్ షేక్(32), పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ముర్షిదాబాద్‌కు చెందిన ఎం.డి. అష్మోల్ హక్ ఏ సోహెల్(34), జార్ఖండ్ రాష్ట్రం సాహెబ్‌గంజ్ జిల్లాకు చెందిన అనికుల్ షేక్(26) ఉన్నారు.

# ఏపీ రీ-సర్వే ప్రాజెక్ట్‌ను వేగవంతం చేయాలి

**- మండల సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లకు 36 ల్యాప్‌టాప్‌ల పంపిణీ**

**- డిసెంబర్ 2026 నాటికి మిగిలిన గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేయాలి**

**- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**



**తిరుపతి,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ-సర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా జిల్లాలో రీ-సర్వే పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్ నందు రీ-సర్వే పనుల నిర్వహణలో భాగంగా జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, హ్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రాంప్రసాద్‌తో కలిసి జిల్లాలోని మండల సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 36 మండలాలకు సుమారుగా రూ.35 లక్షలు విలువ గల 36 ల్యాప్‌టాప్‌లను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ-సర్వే ప్రక్రియలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని, పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఈ ల్యాప్‌టాప్‌లు ఉపయోగపడనున్నాయని తెలిపారు. రీ-సర్వే పనుల్లో భాగంగా మిగిలి ఉన్న గ్రామాల్లో సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, డిసెంబర్ 2026 నాటికి లేదా అంతకంటే ముందుగానే అన్ని పనులను పూర్తి చేసేలా మండల సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి గ్రామంలో రీ-సర్వేకు సంబంధించిన పనులు నాణ్యతతో, పారదర్శకంగా చేపట్టాలని, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లాలో రీ- సర్వే లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధించేందుకు అన్ని స్థాయిల అధికారులు, సర్వే సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సర్వే శాఖ అధికారులు, మండల సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ విద్య ఎంతో ఉత్కృష్టమైనది!

**- రాజ్యాంగ పరిరక్షణకు దోహదపడాలి**

**- అనంత 'లా' కళాశాల వీడ్కోలు వేడుకల్లో డాలర్స్ దివాకర్ రెడ్డి**




**తిరుపతి, ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సమాజంలో ఇంజనీర్లు, డాక్టర్లు అయ్యేందుకు పలువురు తాపత్రయ పడుతున్న పరిస్థితుల్లో ఉన్నత ఆశయంతో 'లా' విద్య అభ్యసించడం దేశానికి గర్వకారణమని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ అధ్యక్షులు డాక్టర్ చమరపాక దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి కచ్ఛపీ సమావేశ మందిరంలో నిర్వహించిన అనంత న్యాయ కళాశాల చివరి సంవత్సర విద్యార్థుల వీడ్కోలు వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవిద్య అనేది ఎంతో ఉత్కృష్టమైనదని సమాజంలో అన్ని వర్గాలకు హితం కోరుతూ రాజ్యాంగ పరిరక్షకులుగా న్యాయ వాదులు గొప్ప పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. సమాజంలో నిత్యం జరిగే ప్రతి సంఘటన సునిశిత దృష్టితో పరిశీలించినప్పుడే ఉత్తమ న్యాయవాదులుగా స్థిరపడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇటీవల తిరుపతిలో నిర్మిత అవుతున్న జిల్లా కోర్టు భవనాల భూమి పూజ కార్యక్రమంలో 15 రోజులపాటు అవిశ్రాంతగా కృషి చేశానని తెలిపారు. సుప్రీంకోర్టు సీజే సైతం తన సేవలను కొనియాడారని గుర్తు చేశారు. లా విద్యార్థులకు ఎలాంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థిని, ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన మోహన్ లక్ష్మి గౌరవ అతిథిగా పాల్గొని కళాశాలలో తాను అధ్యాపకులు నుండి లా అక్షరాభ్యాసం చేసేందుకు ఇచ్చినతోడ్పాటే నేటి ఈస్థాయికి రావడానికి కారణమని కొనియాడారు. పరీక్షలో పాస్ అయ్యేందుకే చదవడం కాకుండా ఉత్తమమైన న్యాయవాదులుగా చలామణి అయ్యేందుకు లోతుగా అధ్యయనం చేస్తూ సూక్ష్మస్థాయి పరిశీలన ఎంతో ముఖ్యమని అన్నారు. తన ఉన్నతికి అధ్యాపకులతో పాటు తన కుటుంబ సభ్యుల తోడ్పాటు ఎంతో ఉందని పేర్కొన్నారు. కళాశాల అకాడమిక్ డైరెక్టర్ డా.నటరాజ రెడ్డి మాట్లాడుతూ సమాజానికి నిర్దేశకులుగా లా విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో రాణించాలని పేర్కొన్నారు. న్యాయ విద్యార్థులకు సమయపాలన ఎంతో ముఖ్యమైనదని తప్పక పాటిస్తే ఉన్నత స్థాయికి చేరవచ్చునని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిరి కుమార్ మాట్లాడుతూ న్యాయవిద్య పట్ల నేడు విద్యార్థులు మక్కువ పెరుగుతోందని ఎంతో బాధ్యతాయుతంగా వృత్తిని చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పాఠ్యపుస్తకలతోపాటు న్యాయస్థానాల తీర్పులను పరిశీలిస్తూ తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. అనంతరం కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీలలో నెగ్గిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ, జాతీయ రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైల్వే ప్రాజెక్ట్,భూసేకరణ, జాతీయ రహదారులు పనులు శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు,ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, కృష్ణపట్నం పోర్ట్, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి, రాయల్ ఎంఫిల్డ్ కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై సమీక్షా పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు తో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో రైల్వే ప్రాజెక్ట్ పనులు, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పోర్ట్ పనులు, శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2,స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, ఏ డీబి రోడ్డులపై నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, తిరుపతి, నెల్లూరు చెన్నై నేషనల్ హైవే పి డి లు, వెంకటేశ్వర్లు, రమేష్,రవీందర్రావు, రైల్వే ప్రాజెక్టు అధికారి, సదరన్ రైల్వే అధికారి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎల్. శివకుమార్, టి టి డి వెల్ఫేర్ అధికారి, ఎస్ఈ ఇరిగేషన్, ఆర్అండ్ బి ఎస్ఈ రాజా నాయక్, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు,తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... శ్రీ సిటీ ఫేజ్ -2, ఏ పి ఐ ఐ సి లోని ఎల్ జి ఫేజ్ -1,2, 3 శ్రీసిటీ ఫేజ్ -1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, రాయల్ ఎంఫిల్డ్ ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్‌పై వున్న సమస్యలను సత్వరమే పరిస్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, విసిఐసి రోడ్డు, ఏపిఐఐసి ప్రాజెక్ట్స్,వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై నడికుడి- శ్రీకాళహస్తి, ఏర్పేడు - పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట, పాకాల - తిరుపతి, తిరుపతి - కాట్పడి అర్కోణం - రేణిగుంట, సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను, దుగ్గరాజపట్నం, వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, నాయుడుపేట-రేణిగుంట, రేణిగుంట- కడప రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులు పూర్తి కావాలని అన్నారు. పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి , పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఫారెస్ట్, జల వనరుల శాఖ అధికారులు అందరూ కలసి సమన్వయంతో పెండింగ్ పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఇస్సేర్, కరకంబాడి, ఎమ్ ఐ జి లే అవుట్ తిమ్మాజికండ్రిగ, పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. వడమాలపేట, ఏర్పేడు మండలాలలో పాదిరేడు అరణ్యం, పల్లం గ్రామాల నందు టీటీడీ ఉద్యోగస్తులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కూడా త్వరిత గతిన చర్యలు తీసుకొని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు, బానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ఏపిఎస్పిడిసిఎల్ ఎస్.ఈ చంద్రశేఖర్, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అధికారి రాంప్రసాద్, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్, సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు, సెక్షన్ అధికారులు భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించండి

**- కమిషనర్ ఎం.జయకృష్ణ**

**తిరుపతి,ఆగస్టు 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా పిర్యాదుల పరిష్కారం వేదికలో ప్రజల నుండి అందే పిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ అధికారులను ఆదేశించారు. ప్రజా పిర్యాదుల పరిష్కారం వేదికలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను మంగళవారం ఉదయం కమీషనర్ పరిశీలించారు. ముందుగా చేపల మార్కెట్‌ను పరిశీలించి దుర్వాసన రాకుండా శుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ వ్యాపారులను ఆదేశించారు. లీలా మహల్ సమీపంలో ఉన్న జంతు వధశాలను పరిశీలించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. జంతు వధశాలలో మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని సిబ్బంది కోరగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వినాయక సాగర్ వద్ద గల చెత్త తరలింపు కేంద్రాన్ని పరిశీలించి, శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. శ్రీపురం కాలనీలో డ్రైనేజి కాలువలను పరిశీలించి, చెత్తచెదారం లేకుండా శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లించాలని తెలిపారు. డ్రైనేజి కాలువలు లేని ప్రాంతాల్లో తాత్కాలిక కాలువలు ఏర్పాటు చేసి మురుగునీరు సజావుగా వెళ్లేలా చూడాలని తెలిపారు. మెడిగో హాస్పిటల్ వీధిలో మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశీలించి వారి సిబ్బందితో సమన్వయం చేసుకుని మెరుగ్గా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027